(PRGI NO: APTEL / 2023 / 88653)
పబ్లిక్ వ్యూ
తెలుగు దిన పత్రిక PUBLIC VIEW TELUGU DAILY
విలేకరులు కావలెను
తెలుగు పత్రికారంగంలో సంచలన వార్తలతో దూసుకెళ్తున్న పబ్లిక్ వ్యూ తెలుగు దినపత్రికకు అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో రిపోర్టర్లు కావలెను.
మీ రెజ్యూమ్ కింద వాట్సాప్ నెంబర్ కు పంపండి
9701132982

(PRGI NO: APTEL / 2023 / 88653)

# పబ్లిక్ వ్యూ

తెలుగు దిన పత్రిక PUBLIC VIEW TELUGU DAILY

సంపుటి : 2 సంచిక : 195 పేజీలు :8 సంపాదకులు : చిరికి లోకేశ్వరరావు ప్రచురణ : అనకాపల్లి శుక్రవారం 3 ఏప్రిల్ 2026 వెల : 5/-రూ॥

VOLUME :2 ISSUE :195 PAGES :8 EDITOR : CHIRIKI LOKESWARA RAO PUBLISHED FROM :ANAKAPALLI FRI 3 APRIL 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Kakinada,Eluru,Vijayawada,Guntur, Ongole, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

హైదరాబాద్ సహా పలు నగరాల్లోని

## ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు



- ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ సోదాలు
- బెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి ఈడీ సోదాలు
- గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

మిగతా 2లో




## హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం.. 35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

- హర్మూజ్ జలసంధి సంక్షోభంపై యూకే ఆధ్వర్యంలో 35 దేశాల సమావేశం
- ఈ కీలక భేటీకి భారత్‌ను ఆహ్వానించిన యునైటెడ్ కింగ్‌డమ్
- వర్చువల్ సమావేశానికి హాజరుకానున్న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ
- ఇప్పటికే 6 భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటాయని తెలిపిన విదేశాంగ శాఖ
- మిత్రదేశాలు సొంతంగా పోరాడాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

మిగతా 2లో

## ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్



- ఏ మాత్రం నిధుల లభ్యత ఉన్నా పెండింగ్ బిల్లులను చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశం
- బిల్లుల చెల్లింపుల్లో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి సూచన
- పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆర్థిక శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష

పబ్లిక్ వ్యూ డెస్క్:గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన పెండింగ్ బిల్లుల చెల్లింపులపై గురువారం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆర్థిక శాఖపై సమీక్షించారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యో గుల పెండింగ్

మిగతా 2లో



## చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుంది

పబ్లిక్ వ్యూ డెస్క్:తెలుగు ప్రజలందరికీ చరిత్రాత్మకమైన రోజు అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుందని చెప్పారు. రాజ్యసభలో అమరావతికి చట్టబద్ధత బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రవేశపెట్టారు. అనంతరం చర్చకు ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ అనుమతించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. "అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మా నాయకుడు నేర్పించారు. ఏపీ రాజధాని గురించి

మిగతా 2లో


## రాజధానికి పట్టిన గ్రహణం వీడింది..

### ఇంటింటా దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకుందాం: మంత్రి నారా లోకేశ్

- అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్లో బిల్లుకు ఆమోదం
- ఇంటింటా దీపాలు వెలిగించి సంబరాలు జరుపుకోవాలని లోకేశ్ పిలుపు
- #APThanksIndia హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టులు పెట్టాలని సూచన
- రాజ్యసభలో బిల్లు పాసయ్యాక ఎంపీలతో మంత్రి లోకేశ్ భేటీ
- రాష్ట్రపతి ఆమోదం తర్వాత గెజిట్ విడుదల చేయనున్న కేంద్రం

పబ్లిక్ వ్యూ డెస్క్:ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టపరమైన హామీ లభించింది. ఈ మేరకు ప్రవేశపెట్టిన ఏపీ పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభలు ఆమో దముద్ర వేశాయి.

మిగతా 2లో






## నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు

### తెలంగాణ బీజేపీ ఎంపీ

- విభజన తర్వాత అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకున్నారన్న లక్ష్మణ్
- రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందన్న లక్ష్మణ్
- జగన్ హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బంది పెట్టారని మండిపాటు

మిగతా 2లో





## అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది

- ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయన్న ట్రంప్
- ట్రంప్ చెప్పినట్లు తమ సైనిక సామర్థ్యాలను దెబ్బతినలేదన్న ఇరాన్
- మా ఆయుధ సంపత్తి గురించి అమెరికాకు సమాచారం లేదన్న ఇరాన్

అమెరికా తమకు లొంగిపోయేవరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని, వారి నాయకత్వాన్ని తీవ్రస్థాయిలో

మిగతా 2లో

# ఇక అమరావతికి తిరుగులేదు.. రాష్ట్రానికి కొత్త శకం మొదలైంది

- రాజ్యసభలోనూ ఆమోదం పొందిన అమరావతి బిల్లు
- అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తించిన పార్లమెంట్
- ఇది చారిత్రక ఘట్టమని అభివర్ణించిన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాకు ప్రత్యేక కృతజ్ఞతలు
- రైతుల త్యాగాలకు దక్కిన గౌరవమని వ్యాఖ్య



పబ్లిక్ వ్యూ డెస్క్:రాజ్యసభలో గురువారం అమరావతి బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక చారిత్రక, నిర్వచనాత్మక ఘట్టమని సీఎం చంద్రబాబు నాయు డు అభివర్ణించారు. అమరావతికి తిరుగులేదని, అది ఆంధ్రప్రదేశ్ హృదయమని, భవిష్యత్తులో దేశానికే గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026 పార్లమెంట్ ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదం పొందడం ద్వారా ప్రజల సమష్టి ఆకాంక్షలకు జాతీయ స్థాయిలో బలమైన గొంతుక లభించిందని చంద్రబాబు పేర్కొన్నారు. "రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్ అనేక సవాళ్లు, అనిశ్చితులను ఎదుర్కొంది. ఈ క్లిష్ట సమయంలో అమరావతి రైతులు చేసిన అసమానమైన త్యాగం, చూపిన విశ్వాసం, కనబరిచిన ధైర్యమే ఈ కలను సజీవంగా నిలిపాయి. ఈ చారిత్రక విజయం వారికే అంకితం," అని ఆయన అన్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రానికి దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న స్థిరత్వం లభించిందని, ప్రతి పౌరుడికి సాధికారత, ఆత్మవిశ్వాసం, ప్రగతితో కూడిన కొత్త శకానికి నాంది పలికిందని తెలిపారు. "అమరావతి రాజధాని హోదా ఇప్పుడు ఎలాంటి సందేహాలకు, చర్చలకు, మార్పులకు తావులేకుండా పటిష్టంగా స్థిరపడింది" అని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్ర ఆకాంక్షలకు అండగా నిలిచిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి చంద్రబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2015 అక్టోబర్ 22న అమరావతికి శంకుస్థాపన చేసిన నాటి నుంచి, 2025 మే 2న దాని పురోగతికి పునరుజ్జీవం పోసే వరకు ప్రతి కీలక దశలోనూ ప్రధాని మోదీ అమరావతికి అండగా నిలిచారని కొనియాడారు. ఈ బిల్లు ముందుకు సాగడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు, కేంద్ర ప్రభుత్వానికి కూడా ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. విభేదాలను పక్కనపెట్టి అమరావతిని ఏకైక 'ప్రజా రాజధాని'గా పునరుద్ఘాటించిన అన్ని పార్టీలు, పార్లమెంట్ సభ్యులకు చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.గురువారం రాజ్యసభలో ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించినట్లు సభాధ్యక్షులు సి.పి. రాధాకృష్ణన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్డీయే సభ్యులు హర్షధ్వానాలు చేశారు. దీంతో అమరావతి ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా చట్టబద్ధమైన గుర్తింపు పొందింది.



## అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం.. వాకౌట్ చేసిన వైసీపీ

- అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ చట్టసవరణ బిల్లు
- రాజ్యసభలో చర్చ అనంతరం బిల్లుకు ఆమోదం
- ఇప్పటికే లోక్ సభలో బిల్లుకు ఆమోదం

పబ్లిక్ వ్యూ డెస్క్::అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టపరమైన భరోసా కల్పిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ బిల్లుకు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఈ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. ఈరోజు రాజ్యసభలో చర్చ అనంతరం ఆమోదం తెలిపింది.కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ఈ బిల్లుపై చర్చను ప్రారంభించారు. బిల్లుపై చర్చ సమయంలో వైసీపీ ఎంపీలు వాకౌట్ చేశారు.రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన అనంతరం రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఏపీ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతికి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీర్వాదం ఉంటుందని అన్నారు. కాగా, రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టంగా మారనుంది. సభలో 11 పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. పది పార్టీలకు చెందిన ఎంపీలు మద్దతిచ్చారు.



## భారత నౌకలకు డోకా లేదు..

### హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక ప్రకటన

- హర్మూజ్ జలసంధిలో భారత నౌకల భద్రతపై ఆందోళన వద్దన్న ఇరాన్
- ఇజ్రాయెల్, అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో జలసంధిపై ఆంక్షలు
- ఇప్పటివరకు 8 భారత నౌకలను సురక్షితంగా బయటకు పంపిన ఇరాన్
- భారత్‌కు రావాల్సిన మరో 19 నౌకలు ఇంకా జలసంధిలోనే చిక్కుకుపోయిన వైనం
- భారత్, చైనా, రష్యా వంటి మిత్ర దేశాలకు మాత్రమే అనుమతిస్తున్నట్లు ప్రకటన

మిగతా 2లో

పబ్లిక్ వ్యూ


# రాజధానికి పట్టిన గ్రహణం వీడింది..

- మొదటి పేజి తరువాయి

ఈ చారిత్రాత్మక పరిణామం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరుపుకోవాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. దీంతో రాష్ట్ర ప్రజలు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. ఈ విషయంపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ (శ) వేదికగా స్పందిస్తూ... "రాజధానికి పట్టిన గ్రహణం వీడి, ప్రజా రాజధానికి చట్టబద్ధత లభించింది" అని హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని పురస్కరించుకుని నేడు రాత్రి 7 గంటలకు ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించి వేడుకలు జరుపుకోవాలని ప్రజలను కోరారు. దీపాలతో సెల్ఫీ తీసుకుని 'మన రాజధాని మన గౌరవం' అంటూ చాూాూష్ఘుఅఎం×అఎఋ హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని సూచించారు. బిల్లుపై చర్చ జరిగిన సమయంలో రాజ్యసభ గ్యాలరీ నుంచి లోకేశ్ ప్రక్రియను పర్యవేక్షించారు. బిల్లు ఆమోదం పొందాక, దీనికి సహకరించిన పలు పార్టీల ఎంపీలను ఆయన నేరుగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రాజ్యసభ క్యాంటీన్‌లో వారితో భేటీ అయ్యారు. గురువారం రాజ్యసభలో ఈ బిల్లుపై దాదాపు రెండు గంటల పాటు చర్చ జరిగాక ఆమోదం లభించింది. తదుపరి ప్రక్రియలో భాగంగా కేంద్ర కేబినెట్ దీనికి పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేసి, రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో అమరావతికి చట్టబద్ధత ప్రక్రియ పూర్తవుతుంది.

# భారత నౌకలకు డోకా లేదు..

ఇజ్రాయెల్, అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించిన ఇరాన్.. భారత్‌కు కీలక హామీ ఇచ్చింది. "భారత మిత్రులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు. వారు సురక్షితంగా ఉన్నారు" అని భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం గురువారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించింది. ఈ భరోసాతో భారత్ కాస్త ఊపిరి పీల్చుకుంది. ప్రపంచంలోని 20 శాతం ఇంధన రవాణా జరిగే హర్మూజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో ఉంది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికాతో వివాదం మొదలైనప్పటి నుంచి ఇరాన్ ఈ మార్గంలో రాకపోకలను దాదాపు నిలిపివేసింది. అయితే భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ వంటి స్నేహపూర్వక దేశాల నౌకలను మాత్రమే అనుమతిస్తున్నట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఈ దిగ్బంధనం వల్ల భారత్ సహా పలు దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే 8 భారత నౌకలు హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. వీటిలో దీఔ ొ=, దీఔ జూవీ అనే రెండు ఎల్‌పీజీ క్యారియర్లు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 94,000 టన్నుల ఎల్‌పీజీ భారత్‌కు చేరింది. అయితే, భారత్‌కు రావాల్సిన ఎల్‌పీజీ, ముడిచమురు, ఎల్‌ఎన్‌జీతో కూడిన మరో 19 నౌకలు ఇంకా అక్కడే చిక్కుకుపోయాయని అధికారులు తెలిపారు.

ఇటీవల జరిగిన

మంత్రిత్వ శాఖల సమావేశంలో షిప్పింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ఈ వివరాలు వెల్లడించారు. చిక్కుకున్న నౌకల్లో భారత్‌కు చెందినవి 9 ఉండగా, విదేశీ జెండాలతో భారత్‌కు వస్తున్నవి 10 ఉన్నాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభం కారణంగా మొత్తం 500 నౌకలు జలసంధిలో నిలిచిపోయినట్లు సమాచారం.

# హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం..
# 35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మూసివేసిన హర్మూజ్ జలసంధి సంక్షోభం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ మార్గాన్ని తిరిగి తెరిపించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) నడుం బిగించింది. ఇందులో భాగంగా 35 దేశాలతో నిర్వహిస్తున్న అత్యవసర సమావేశానికి భారత్‌ను కూడా ఆహ్వానించింది. గురువారం వర్చువల్‌గా జరిగే ఈ భేటీలో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పాల్గొంటారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ధ్రువీకరించారు. భారత ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. దేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 40శాతం, ద్రవీకృత సహజ వాయువు (ాచీ+)లో 50శాతం, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ూా+)లో 80శాతానిపైగా ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. ఈ నేపథ్యంలో భారత నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇరాన్‌తో పాటు ఇతర సంబంధిత దేశాలతో చర్చిస్తున్నామని జైస్వాల్ తెలిపారు. ఈ చర్చల ఫలితంగానే గత కొన్ని రోజుల్లో ఆరు భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటగలిగాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా స్పందించారు. గతంలో జలసంధిని తెరిపించడం తన ప్రాధాన్యత అని చెప్పిన ఆయన, బుధవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ప్లేటు ఫిరాయించారు. "మీ చమురు మీరే తెచ్చుకోండి. మీ కోసం మీరు పోరాడటం నేర్చుకోండి. అమెరికా ఇకపై మీకు సహాయం చేయదు" అంటూ యూకే వంటి మిత్రదేశాలకు ఆయన సూచించారు. ఇరాన్‌ను ఇప్పటికే దెబ్బతీశామని, కష్టమైన భాగం పూర్తయిందని ట్రంప్ పేర్కొన్నారు.

మరోవైపు యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూఏఈ సహా 35 దేశాలు సముద్ర భద్రత పునరుద్ధరణకు కలిసి పనిచేయడానికి అంగీకరించాయని

ప్రకటించారు. నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరించడం, చిక్కుకుపోయిన నౌకలు, సిబ్బంది భద్రతను పటిష్టం చేయడం, కీలక సరుకుల రవాణాను తిరిగి ప్రారంభించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. యూకే విదేశాంగ కార్యదర్శి వైవెట్ కూపర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీ అనంతరం, తదుపరి కార్యాచరణపై అధికారులు చర్చిస్తారని సమాచారం.

# అమెరికా లొంగిపోయేవరకు
# యుద్ధం కొనసాగుతుంది

- మొదటి పేజి తరువాయి

దెబ్బతీశా మని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ధీటుగా స్పందించింది. ట్రంప్ చెప్పినట్లుగా తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని పేర్కొంది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి ప్రకటన చేయగా, ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తి సమాచారం లేదని పేర్కొంది. వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతో పాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామని ట్రంప్ చేసిన వాదనలను ఇరాన్ ఖండించింది. అమెరికా రాతి యుగం నాటి నేరాలను ఆధునిక యుగానికి తీసుకువస్తోందని ఆరోపించింది. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చతెచ్చే నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది.

# చరిత్రలో ప్రజా రాజధానిగా
# అమరావతి గుర్తుంటుంది

- మొదటి పేజి తరువాయి

ప్రజలకు స్పష్టత ఇస్తున్నాం. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది.. మరో రాష్ట్రానికి అలా లేకుండా వదిలేయడంతో సమస్య మొదలైంది. విభజనకు వ్యతిరేకం కాదు కానీ.. జరిగిన విధానం సరిగా లేదు. రాష్ట్ర విభజన దేశంలో తొలిసారి జరగలేదు. వాజ్‌పేయీ హయాంలో 3 రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విభజన జరిగింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి రూ. 16వేల కోట్ల రెవెన్యూ లోటు ఉంది. 5 కోట్ల మంది ఏపీ ప్రజలు సీఎం చంద్రబాబు వైపు ఆశగా ఎదురుచూశారు. తెలుగు ప్రజలకు ఆయన ఎన్నో ఆకాంక్షలు, విజన్ కల్పించారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుని ముందుకెళ్లారు. రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములిచ్చారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల నాటకమాడింది. రాజధాని అమరావతి కోసం ఉద్యమించిన రైతులను తీవ్రంగా హింసించారు. గర్భిణులు అని కూడా చూడకుండా లాఠీలతో కొట్టించారు. అమరావతి మహిళలకు సాష్టాంగ

నమస్కారం చేస్తున్నా. 2014లోనే అసెంబ్లీలో అమరావతిపై ఏకగ్రీవ తీర్మానం జరిగింది. చరిత్రలో ఏ రాజధాని చూసినా నదీ తీర ప్రాంతాల్లోనే విలసిల్లాయి. కృష్ణా నది తీరంలో అమరావతి నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐకానిక్, వరల్డ్ క్లాస్ రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది" అని రామ్మోహన్‌నాయుడు అన్నారు.

# నాడు హైదరాబాద్ అభివృద్ధికి
# చంద్రబాబు కృషి చేశారు

దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరమని ఆయన అన్నారు. రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. భవ్య రాజధాని కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యమన్నారు. రాజధాని అవసరమని, కానీ జగన్ తన హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. రాజధాని కోసం చాలాకాలంగా పోరాడిన మహిళలకు, రైతులకు ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. అమరావతి బిల్లు కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చిందని అన్నారు.

# హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

పశ్చిమ బెంగాల్‌లో బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ప్రముఖ రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తోంది. ఐప్యాక్ కన్సల్టెన్సీ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా దర్యాప్తు సంస్థ దృష్టి సారించింది. బొగ్గు స్మగ్లింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కొంతకాలంగా సోదాలు జరుగుతున్నాయి. గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాలు, ఐప్యాక్ అధినేత ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించింది. నాడు సోదాల సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా అక్కడకు వచ్చి, మీడియా ఎదుటే ఫైళ్లతో వెళ్తూ కనిపించడం చర్చకు దారితీసింది. సోదాల సమయంలో బెంగాల్ ప్రభుత్వం నుంచి ఆటంకాలు ఎదురయ్యాయని ఈడీ అప్పుడు ఆరోపించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. మరోవైపు, మమతా బెనర్జీ కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపణలను ఖండించింది. సోదాల పేరుతో ఈడీ తన పరిధిని ఉల్లంఘించిందని ఆరోపించారు.

# ఉద్యోగులకు రూ.7,358 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదలకు గ్రీన్ సిగ్నల్

- మొదటి పేజి తరువాయి

బిల్లుల చెల్లింపులపై ఆరా తీశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరపాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను ఏ మేరకు అమలు చేశారని అడిగారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు కసరత్తు చేశామని, నిధుల లభ్యతను బట్టి చెల్లింపులను జరుపుతున్నామని అధికారులు వివరించారు.

ఉద్యోగులకు రిలీఫ్ ఇచ్చేలా మొత్తంగా రూ. 7,358 కోట్ల మేర పెండింగ్ బిల్లుల విడుదలకు చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీంట్లో భాగంగా ఇప్పటికే ప్రావిడెంట్ ఫండ్ బకాయిల కింద రూ. 1,848 కోట్లను నేరుగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామని, అలాగే గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద 4,793 మందికి సంబంధించిన రూ. 76 కోట్ల చెల్లింపులు కూడా పూర్తి చేశామని వెల్లడించారు. వీటితో పాటు గ్రాట్యుటీ బకాయిల కింద రూ. 3,411 కోట్లు, పెండింగులో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ. 1,800 కోట్లు, పోలీస్ శాఖకు సంబంధించి అదనపు సరెండర్ లీవుల నిమిత్తం రూ. 223 కోట్ల బిల్లుల విడుదల ప్రక్రియ కొనసాగుతోందని మరో రెండు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. తల్లికి వందనం తర్వాత ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో చెల్లింపులు జరుపుతోంది ఉద్యోగులకు మాత్రమేనని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిధుల లభ్యతను బట్టి ఉద్యోగుల పెండింగ్ బిల్లుల సహా అన్ని రకాల పెండింగ్ బిల్లులకు చెల్లింపులు జరపాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల విషయంలో జరిగిన పరిణామాలు ప్రస్తావనకు వచ్చాయి. నాడు ఉద్యోగుల సొంత సొమ్మును కూడా నాటి ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంతో వారు తీవ్ర ఇబ్బందులుపడ్డారని, తమ నిధుల కోసం ప్రశ్నించిన నేతలపై కేసులు పెట్టి వేధించారనే అంశం చర్చకు వచ్చింది. ఇదే సమీక్షా సమావేశంలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు, మెటిరియల్ సరఫరా చేసిన వారికి జరపాల్సిన చెల్లింపులపైనా ముఖ్యమంత్రి ఆరా తీశారు. వివిధ శాఖలకు మెటీరియల్ సరఫరా చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లకు రూ. 614 కోట్ల బకాయిల చెల్లింపులు జరిపామని అధికారులు తెలిపారు. పనులు చేసిన, మెటిరీయల్ సరఫరా చేసిన వాళ్లకు బిల్లులు చెల్లింపులు జరిపే ప్రక్రియలో చిన్న కాంట్రాక్టర్లకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# సంపాదకీయం

## భావజాలాన్ని అంతమొందించలేరు...!

నక్సలైట్ ఉద్యమం ముగింపు దినం 2026 మార్చి 31. అంటే దేశంలో కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సాయుధ పోరాటం చేస్తున్న ఒక సిద్ధాంత పార్టీని నిర్మూలించాలనే కేంద్ర ప్రభుత్వ సంకల్పం దినం. ఈ కాలంలో వేలాది మావోయిస్టులు, పోలీసులు, నిర్భాగ్యులైన ఆదివాసీలు మరణించారు. ఈ ఆరు దశాబ్దాలలో మావోయిస్టు ఉద్యమం చాలా పొందింది, చాలా కోల్పోయింది. దినిని ఎవరూ నిరాకరించలేరు.

మార్క్సిస్టు-లెనినిస్టు, మావోయిస్టు సిద్ధాంతం బలంతో ప్రారంభమైన నక్సల్బరి ఉద్యమం క్రమంగా దేశమంతటా వ్యాపించింది. దీనికి ప్రధాన కారణం - కులం, మతం పేరుతో పేద వర్గాలపై ఉన్నత వర్ణాలు, పెట్టుబడిదారులు, సామంతుల అణచివేత, అన్యాయం, అత్యాచారాలు. మావోయిస్టు ఉద్యమం పేద, సర్వహారా వర్గాలపై జరుగుతున్న, చేస్తున్న అణచివేత, అన్యాయం, అసమానత, అత్యాచారాలు చేస్తున్న వారిని గుర్తించేలా చేసింది. స్వతంత్ర దేశ ప్రభుత్వాలు దీనిని సరిగ్గా గుర్తించి ఉంటే, ఇపుడు వేలాది, లక్షలాది మావోయిస్టులు, పోలీసులు, నిర్భాగ్యులైన ఆదివాసీలు చనిపోయేవారు కాదు. అణచివేత, అన్యాయం, అసమానత, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు నక్సలైట్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వేలాది మంది యువకులు ఈ ఉద్యమంలో చేరారు. ప్రజలను చైతన్యపరిచారు. ఆదివాసీలకు విద్యాబోధన చేసి, అనేక రకాల శిక్షణలు ఇచ్చారు. ప్రారంభంలో పోలీసులు, నక్సల్ వాదుల మధ్య పెద్ద శత్రుత్వం ఏమీ లేదు. నక్సలైట్లు గ్రామాల్లో సామంత వర్గాలకు వ్యతిరేకంగా తమ ఉద్యమాన్ని తీవ్రం చేశారు. దీన్ని చూసి సామంతులు ప్రభుత్వాలను సంప్రదించారు. ప్రభుత్వం సామంతుల భద్రత కోసం గ్రామాల్లో పోలీసులను పంపి నక్సలైట్లను తమ లక్ష్యంగా చేసుకుంది. ఇదే సమయంలో దేశంలో పెరుగుతున్న నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రజాస్వామ్య ప్రభుత్వం నిషేధం విధించింది. దీన్ని చూసి నక్సలైట్లు తమ భద్రత కోసం ఆదివాసీ ప్రాంతాలకు వెళ్లి, ఖనిజ సంపద, ప్రకృతిని కాపాడేందుకు కృషి చేయడం ప్రారంభించారు. పెట్టుబడిదారులు, పెద్ద కంపెనీల ధనబలంతో రాజ్యాంగం మీద ప్రమాణం చేసి మళ్లీ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పెట్టుబడిదారుల, పెద్ద కంపెనీల కోసం మావోయిస్టులను అడవుల నుంచి తరిమేందుకు ఆపరేషన్ కగార్ ప్రారంభించింది. దీని ఫలితంగా పెద్ద ఎత్తున వేలాది మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపివేయబట్టారు. కొంత మంది మావోయిస్టు నాయకులు లొంగిపోయారు. ఈ ప్రక్రియకు ముందు మావోయిస్టుల వైపు నుంచి అనేక శాంతి ప్రతిపాదనలు వచ్చాయి. అయినప్పటికీ, ప్రభుత్వం అన్ని ప్రతిపాదనలను తోసిపుచ్చింది, లొంగిపొండి లేదా ఎన్‌కౌంటర్‌లో చనిపోండి అని ప్రతిపాదన చేసింది. దేశాన్ని రక్షించే సైన్యాన్ని ఆధునిక ఆయుధాలతో తమ సొంత పౌరుల మీద దాడి చేసింది. దేశంలో ఇప్పటికీ అనేక మంది నక్సలైట్లు అడవుల్లో, జైళ్లలో ఉన్నారు. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుడు గణపతి ఇప్పటికీ అజ్ఞాతంలో ఉన్నారు. ఇదే సమయంలో ఒడిశా ఎమ్ఏడీసీ విభాగం కార్యదర్శి రజితా సాయుధ పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేసిన సహచరుల మరణం వృథా పోనివ్వమని ఆమె చెప్పారు. మావోయిస్టుల సాయుధ పోరాటం ప్రతీ హింస కోసమేనని అందరికీ తెలుసు. దేశ, ప్రపంచ పౌరులు మంచి ప్రత్యామ్నాయ ప్రభుత్వం కోసం వెతుకుతున్నారు. ప్రతి ఒక్కరూ మార్పు కోరుకుంటున్నారు. ఈ మార్పు మావోయిస్టు భావజాలం ద్వారా సాధ్యమవుతుంది. మావోయిస్టు భావజాలం ఇప్పటికీ ప్రజల్లో సజీవంగా ఉంది, భవిష్యత్తులో కూడా ఉంటుంది

# మట్టి బేసన్‌తో ముందు అడుగు వేసి శ్రీవేణి సందేశం!

## ఉపాధి కోసం వికసిత్ భారత్ హామీ

## మడుతూరులో పనులకు శ్రీకారం



**అచ్యుతాపురం, (పబ్లిక్ వ్యూ) ఏప్రిల్ 2:** మండలంలోని మడుతూరు గ్రామంలో 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్', 'ఆజీవక మిషన్ (వి.బి.జి రామ్ జి)' ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి మోటూరు శ్రీవేణి కూటమి నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మోటూరు శ్రీవేణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద ప్రజలకు స్థిరమైన ఉపాధి కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించి ప్రజల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని ఆమె అన్నారు.

ప్రత్యేకంగా, పల్లెటూరి సాంప్రదాయాన్ని ప్రతిబింబించేలా శ్రీవేణి స్వయంగా నెత్తిపై మట్టి బేసన్ మోసి పనులకు శ్రీకారం చుట్టడం అక్కడి ప్రజలను ఆకట్టుకుంది. చెట్ల మధ్య సహజసిద్ధమైన వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం గ్రామీణ స్ఫూర్తిని చాటిచెప్పింది.

ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, శనివాడ సత్యరావు, బలిరెడ్డి శ్రీనివాసరావు, పిల్లా వరలక్ష్మి, శనివాడ చిన్ని, నారాయణరావు, నాయుడు, రమణ, ప్రేమ్‌కుమార్, దేశంశెట్టి గోవింద, మరిసా సంజీవ్, నడుపూరు ప్రవీణ్, నరేష్, రాంబాబు, వెల్లంశెట్టి శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ శశి తదితరులు పాల్గొన్నారు.

## నవ్యాంధ్ర ప్రజల ఆకాంక్ష నెరవేరిన రోజు.

రాష్ట్ర ఎం టి ఎస్ ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి కామేష్ రెడ్డి .






**కంచిలి( పబ్లిక్ వ్యూ) ఏప్రిల్2:** నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కోసం ఎన్నో త్యాగాలు, పోరాటాలుచెసిన ఐదు కోట్లఆంధ్రులు ఆత్మగౌరవం నేటి పార్లమెంట్ బిల్లుతో ప్రమాణీకరించబడినది.పాఠశాల లో పాఠాలు చెప్పెటప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏమిటి? అని విద్యార్థులు అడిగినప్పుడు మా భాద వర్ణణాతీతం. అటువంటి భాద నుండి విముక్తి కలిగి, ఐదు కోట్ల ఆంధ్రులు చారిత్రక ఘట్టం తో ఉపాధ్యాయలోకం అత్యంత సంతోషకరమైన డే గా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ,ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి1998 రాష్ట్ర ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం అమరావతి తరుపున రాష్ట్ర ఎం టి ఎస్ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బుడ్డెపు కామేష్ రెడ్డి ,అసోసియేషన్ అధ్యక్షులూ సభ్యులు ప్రత్యేక అభినందనాలు,ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఎన్రోల్మెంట్ డ్రైవ్.



**కవిటి (పబ్లిక్ వ్యూ) ఏప్రిల్2:** మండలంలోని ఉపాధ్యాయులు అంగనవాడి కేంద్రాల్లో ఉన్న ఐదు సంవత్సరాలు వయసు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ చేసుకోవడానికి గురువారం స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. బడి బయట పిల్లలను కూడా జాయిన్ చూసుకుంటున్నట్టు తెలిపారు.ఈ కార్య క్రమం లో మండల విద్యాశాఖ అధికారులు ధనుంజయ మజ్జి , ఎస్. రామకృష్ణ, ఉపాధ్యాయుల రఘు, శ్రీనివాస్, సిఆర్ఎంటి బి. తులసిదాస్ తదితరులు పాల్గున్నారు.

## వేంపాడు ప్రభుత్వ పాఠశాలలో ఎన్రోల్మెంట్ డ్రైవ్





**నక్కపల్లి (పబ్లిక్ వ్యూ) ఏప్రియల్ 2.** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేంపాడు ప్రధానోపాధ్యాయు రాలు మరియు ఉపాధ్యాయబృందం వేంపాడు గ్రామంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది.పాఠ శాలలో అమలుజరుగుతున్న కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులు వివరించి వారి పిల్లలను పాఠశాలలో జాయిన్ చేయమని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల నావీజ చైర్మన్ కమిడి బాబూరావు గారు,మరియు గ్రామ సర్పంచ్ కుమారుడు సూర్యనారాయణ గారు జుఃశ సర్పంచ్ నాగరాజుగారు ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి వరలక్ష్మి గారు మరియు పాఠశాల ఉపాధ్యాయబృందం పాల్గొనడం జరిగింది

# ప్రగడకు బ్రహ్మరథం... సెంట్రల్ కేఫ్ ఘన ప్రారంభం










**అచ్యుతాపురం, (పబ్లిక్ వ్యూ) ఏప్రిల్ 2:** చోడపల్లి గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'సెంట్రల్ కేఫ్' గురువారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై కేఫ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వ్యాపార సంస్థలు ప్రారంభం కావడం ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని పేర్కొన్నారు. యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని స్థిరమైన జీవనోపాధిని ఏర్పరచుకోవాలని సూచించారు.

ఇంకా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం చేస్తామన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, కాండ్రేగుల అప్పారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూనిశెట్టి రమణ, విమలనాయుడు, కర్రి వెంకటరమణ, పల్లి శేషగిరిరావు, జనపరెడ్డి శ్రీనివాసరావు, పవన్ విజయ్, భాస్కరరావు, వడిశల నాయుడు, ధర్మిరెడ్డి ప్రసాద్, కాండ్రేగుల వెంకటరమణ, చొప్పా తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలపై కమిషనర్కు వినతి







**ఇచ్ఛాపురం( పబ్లిక్ వ్యూ) ఏప్రిల్ 2:**
ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో తీవ్రంగా పడిపోయిన ప్రాథమిక సదుపాయాల నేపథ్యంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్, సంఘసేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రమేష్ కి జాయింట్ పిటిషన్ ఇచ్చారు. తాగునీటి కొరత, దుర్భర రోడ్లు, పని చేయని డ్రైనేజీలు, ట్యాంకర్ నీటి పంపిణీలో ప్రమాదకర పరిస్థితులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని వారు అధికారులు డిమాండ్ చేశారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ గారు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ---"వారం రోజుల్లో ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభిస్తాం"అని హామీ ఇచ్చారు. దీనితో స్థానిక ప్రజల్లో స్వల్ప నమ్మకం, ఆశలు చిగురించాయి.

పిటిషన్‌లో ప్రస్తావించిన ప్రధాన సమస్యలు

**తాగునీటి కొరత**

జల్ జీవన్ మిషన్ అమలు ఆలస్యమవడం వల్ల అనేక వార్డుల్లో ఇప్పటికీ తాగునీటి సరఫరా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గృహిణులు, వృద్ధులు, చిన్నారులు అత్యంతగా ప్రభావితమవుతున్నారు.

**రోడ్ల దుర్భర స్థితి**

నిర్వహణ లోపం కారణంగా రోడ్లు గుంతలతో నిండిపోయి ప్రయాణాలు కష్టసాధ్యమయ్యాయి. రవాణా అంతరాయం, ప్రమాదాలు పెరిగే పరిస్థితి నెలకొంది.

**డ్రైనేజీ వ్యవస్థ లోపాలు వలన**

అనేక ప్రాంతాల్లో డ్రైనేజీలు మూసుకుపోయి చెత్తతో నిండిపోయాయి. దుర్వాసన, దోమల పెరుగుదల, వ్యాధుల ప్రబలింపు వంటి అంశాలను సంఘం బాధ్యతాయుతంగా చర్చించింది.

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 50 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించాలనిజాతీయ బీసీ సంక్షేమ సంఘం బలంగా డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులుజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. గుణ ప్రసాద్, జిల్లా అడ్వైసర్ ఎల్. గోవిందరాజులు, ఇచ్ఛాపురం మండల కన్వీనర్ సాలిన ఢిల్లీ రావు,సాలిన పద్మ, మద్దిల సిమ్మయ్య,సాలిన నారాయణ, నీలాద్రి,సప్ప లీలావతి, గౌరీ, నర్తు లక్ష్మి ,స్వప్న ,నాగమణి , నీలూ సహనీమరియు ఇతర బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# గంగవరం పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేసిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



**గాజువాక ( పబ్లిక్ వ్యూ ) ఏప్రిల్ 2:** గాజువాకనియోజకవర్గం గంగవరంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాల పరిస్థితులు, విద్యాబోధనపై సమగ్రంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. భోజనం సరిగా లేకపోతే వెంటనే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు.పాఠశాల సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. భోజనం సిద్ధమైన తరువాత ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించి, సరైనదని నిర్ధారించిన తర్వాతే విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు.అదేవిధంగా, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా లీప్ యాప్ వినియోగాన్ని తప్పనిసరి చేయాలని పల్లా సూచించారు. విద్యార్థుల భోజనం నాణ్యతపై తల్లిదండ్రులు తమ అభిప్రాయాలు, ఫిర్యాదులు లీప్ యాప్ ద్వారా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ఐవీఆర్ఎస్ ద్వారా కూడా తరచూ తల్లిదండ్రుల ఫీడ్‌బ్యాక్ సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని, నిర్లక్ష్యం లేదా ఎటువంటి తప్పిదం జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.పాఠశాలలో విద్యాబోధన తీరు, హాజరు వివరాలు, మౌలిక వసతులు, పరిశుభ్రతపై కూడా పల్లా సమీక్ష నిర్వహించారు. ప్రతి విద్యార్థి మెరుగైన విద్యను అందుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే నాణ్యతతో కూడిన విద్య, సదుపాయాలు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

# రాంపురం దోపిడి కేసును చేదించిన పెందుర్తి పోలీసులు

**గంటల్లోనే నిందితుల అరెస్ట్. దోపిడీ సొత్తు స్వాధీనం.**



**పెందుర్తి, (పబ్లిక్ వ్యూ), ఏప్రిల్ 2 :** స్థానిక పెందుర్తి నియోజకవర్గం, రాంపురం ప్రాంతంలో జరిగిన దోపిడి కేసును పెందుర్తి క్రైమ్ పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించి నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో బాధితుడిపై దాడి చేసి నగదు, సెల్ ఫోన్, ఏటీఎం కార్డు దోచుకున్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**లారీ డ్రైవర్‌పై దాడి -- డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని బెదిరింపు:**

చినముసిడివాడకు చెందిన లారీ డ్రైవర్ బంటు త్రినాథ్ రావు మార్చి 31న ఉదయం సరుకు దిగజార్చి తిరిగి ఇంటికి వస్తుండగా, రాత్రి సమయంలో రాంపురం సమీపంలో లారీకి డీజిల్ అయిపోవడంతో ఆగిపోయింది. ఆయిల్ కోసం పెట్రోల్ బంక్ వైపు నడుస్తుండగా ఆటోలో వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతడిని అడ్డగించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు లేవని చెప్పడంతో, అతడిని రాళ్లు, ఇనుప కడియాలతో దారుణంగా కొట్టి తలకు గాయపరిచారు. అనంతరం అతని దగ్గరున్న రూ.600 నగదు, సెల్ ఫోన్, ఎస్బిఐ ఎటిఎం కార్డును లాక్కున్నారు. బాధితుడు ప్రాణభయంతో అక్కడి నుంచి తప్పించుకున్న త్రినాథ్ రావు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుని సహాయం కోరాడు. అక్కడి వ్యక్తులు అతని బంధువులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు చేరుకునేలోపే నిందితులు ఆటోలో పారిపోయారు.

**కేసు నమోదు – వేగంగా దర్యాప్తు:**

ఈ ఘటనపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.132/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఆదేశాల మేరకు, డిసిపి క్రైమ్స్ కె.లతామాధురి, ఏసీపీ ఏ.నరసింహమూర్తి పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు.

**గంటల్లోనే నిందితుల గుర్తింపు – అరెస్ట్:**

క్రైమ్ ఇన్స్పెక్టర్ ఎం.చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎస్సై డి.సూరిబాబు బృందం దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అరెస్ట్ చేసింది. అరెస్ట్ చేసిన నిందితులు వెలమల మోహనరావు (26), పొన్నాడ వెంకటేష్ (19) దోపిడీ సొత్తు

నిందితుల వద్ద నుండి రూ.300 నగదు, సెల్ ఫోన్, ఏటీఎం కార్డు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సొత్తు విలువ సుమారు రూ.5,300గా అంచనా.

**పోలీసుల ప్రతిభకు ప్రశంసలు:**

ఈ కేసును త్వరితగతిన ఛేదించిన క్రైమ్ ఇన్స్పెక్టర్ చంద్ర మౌళి, ఎస్సై సూరిబాబు మరియు వారి సిబ్బంది పెందుర్తి పి.ఎస్. కె.శ్రీనివాసరావు, జి.నాగరాజు, వి.పెరయ్యనాయుడు, పి.శాంత కుమార్, బి.దేముడునాయుడు, ఎల్.కె.తాతారావులను ఉన్నతాధికారులు అభినందించారు. పోలీసుల సమర్థవంతమైన చర్యలతో నిందితులను తక్షణమే అరెస్ట్ చేయడం స్థానికంగా ప్రశంసలు అందుకుంది.

**ప్రజలకు పోలీసుల సూచనలు :**

రాత్రి వేళల్లో ప్రయాణించే వారు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

# ప్రభుత్వ వసతి గృహాల్లో జీరో వేస్ట్ మేనేజ్మెంట్ విధానాన్ని పరిశీలించిన ఏపీ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ సెక్రటర డి. రోనాల్డ్ రోస్.







పరవాడ (పబ్లిక్ వ్యూ) ఏప్రిల్ 2; రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా అనకాపల్లి జిల్లాలో మొదటగా అమలు చేస్తున్న జీరో వేస్ట్ మేనేజ్మెంట్ విధానం అమలుతీరును జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తో కలిసి ఏపీ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ సెక్రటరీ డి. రోనాల్డ్ రోజ్ గురువారం పరవాడ సాంఘిక సంక్షేమ , బీసీ సంక్షేమ శాఖలకు చెందిన ప్రభుత్వ వసతి గృహాలను పరిశీలించారు. వసతి గృహాల్లో విద్యార్థులు స్నానాలకు , మరుగుదొడ్లకు వినియోగించే నీటిని ఇంకుడు గొయ్య లో నిల్వచేసి నీటి నిల్వలు పెంచే విధానాన్ని జీరో వేస్ట్ మేనేజ్మెంట్ విధానం అని దీని ద్వారా భూగర్భ జలాలు మెరుగు పడడమే కాకుండా నీటి కొరత ఉండదని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశంలో స్పష్టం చేశారు. ఆ విధంగా ఉన్న నీటిని వసతగృహాల్లోని ఖాళీ స్థలాల్లో సేంద్రియ ఎరువులతో కూరగాయలు కూడా పండించవచ్చని పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలో ప్రయోగాత్మకంగా ఆ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి దృష్టికి నక్కపల్లి స్టీల్ ప్లాంట్ ప్రారంభోత్సవ సమావేశంలో తీసుకువెల్లి ప్రశంసలు అందుకున్నారు. దీంతో జీరో వేస్ట్ మేనేజ్మెంట్ విధానం అమలుతీరును పరిశీలించాలని ఏపీ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ సెక్రటరీని ముఖ్యమంత్రి ఆదేశించడంతో వసతి గృహాలను కలెక్టర్తో కలిసి సందర్శించి జీరో వేస్ట్ మేనేజ్మెంట్ విధానాన్ని పరిశీలించారు. వసతి గృహాల్లో ఉన్న ఖాళీ స్థలాలు, పండిస్తున్న కూరగాయల మొక్కలను పరిశీలించారు. వసతి గృహాల విద్యార్థులను యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో జీరో వేస్ట్ మేనేజ్మెంట్ విధానాన్ని ఎలా అమలు చేస్తున్నారని వసతి గృహ సంక్షేమ అధికారిని పి . సుజాతను అడిగి తెలుసుకున్నారు. పథకాన్ని ఏ విధంగా అమలు చేస్తున్నది అధికారులకు వార్డెన్ వివరించారు.ప్రభుత్వ బాలికల వసతి గృహంలోని విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహానికి పెయింటింగ్ వేయించాలని బాలికలు కోరడంతో పెయింట్లు ఇస్తాను మీరే వేసుకోండి అని విద్యార్థులను చమత్కరించారు. బాలికల వసతి గృహంలో సుమారు గంటన్నర పాటు ఉండి పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీసీ, సాంఘిక సంక్షేమ శాఖల ఉన్నతాధికారి బి.రామానందం,ఎంపిడివో రమేష్ నాయుడు, స్థానిక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# రైతుల పోరాటం గెలిచింది.. అమరావతి శాశ్వతంగా నిలిచింది.





- పార్లమెంటులో అమరావతి బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం హర్షణీయం-.
- రాజధాని రైతులు, మహిళల త్యాగాలు వృథా కాలేదు.
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా విరాజిల్లుతుంది.
- మావిగన్ జగన్ రెడ్డికి దేశం పారాగన్ బుద్ధి చెప్పింది.
- అనకాపల్లి జనసేన కార్యాలయం నుండి మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.



అనకాపల్లి ( పబ్లిక్ వ్యూ) ఏప్రిల్ 2;పార్లమెంటు ఉభయ సభలు అమరావతి బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం రాష్ట్ర ప్రజలు, రైతుల విజయం అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా అనకాపల్లి పట్టణంలోని జనసేన కార్యాలయం నుండి మహిళలు, యువత ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర గారు మాట్లాడుతూ... ఆంధ్రుల కల అమరావతికి చట్టబద్ధత రావడం పట్ల రాష్ట్ర ప్రజలంతా పండుగ చేసుకుంటున్నారు. ప్రధానంగా అమరావతి ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మహిళలకు ధన్యవాదాలు. రాష్ట్రాన్ని విడగొట్టి రాజధాని కూడా లేని పరిస్థితుల్లో శివరామకృష్ణన్ కమిషన్ నివేదిక మేరకు విజయవాడ గుంటూరు మధ్య అమరావతిని రాజధానిగా ప్రకటించాం. చంద్రబాబు గారిపై నమ్మకంతో 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూములిచ్చారు. దేశ వ్యాప్తంగా పుణ్య నదుల నుంచి నీరు, పుణ్యక్షేత్రాల నుంచి మట్టి తీసుకొచ్చి ప్రధానమంత్రి గారి చేతుల మీదుగా శంకుస్థాపన చేసాం. ఢిల్లీని మించిన రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దామని ఆరోజు హామీ ఇచ్చాం. అందుకు అనుగుణంగా సచివాలయం అసెంబ్లీ హైకోర్టు సహా అనేక భవనాలను నిర్మించాం. ఫేక్ హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి మూడు రాజధానుల పేరుతో అమరావతిని నాశనం చేయాలనుకున్నాడు. సౌత్ ఆఫ్రికా మోడల్ అంటూ వైజాగ్ అమరావతి కర్నూలులో మూడు రాజధానులు ఏర్పాటు చేస్తానని దగా చేశాడు. ఐదేళ్లు అమరావతిలో రైతుల్ని హింసించాడు. దేవాలయాలకు వెళ్ళే మహిళా రైతులని అవమానించాడు. బూటు కాళ్ళతో మహిళల పొత్తికడుపులో తన్నించాడు. అమరావతి రాజధాని అని కోర్టులు తేల్చి చెప్పినా వినకుండా మూర్ఖంగా ప్రవర్తించాడు.

2024 ఎన్నికల్లో ప్రజలంతా ఏకమై జగన్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పి... అమరావతి రాజధాని అని నినదించారు. 151 నుండి 11 కి పడేశారు. తాజాగా అమరావతిపై అసెంబ్లీలో తీర్మానానికి కూడా ఎగ్గొట్టాడు. ఈరోజు పార్లమెంటులో తీర్మానం పెడితే వైసీపీ ఎంపీలతో వాకౌట్ చేయించాడు. అమరావతి అంటే జగన్ రెడ్డికి ఎందుకింత కడుపు మంట.? రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని వికేంద్రీకరిస్తోంది. ఉత్తరాంధ్రలో అర్సలామెట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ లాంటి ప్రఖ్యాత కంపెనీలను తీసుకొస్తున్నాం. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్, రాయలసీమలో ఎలక్ట్రానిక్స్ క్లస్టర్, హార్టికల్చర్ అభివృద్ధి చేస్తున్నాం. ఐదేళ్లు అమరావతిపై కాల కూట విషం చిమ్మిన జగన్.. నిన్న మావిగన్ అనే కొత్త పేరు చెప్పాడు.. మొన్నటి వరకు మూడు రాజధానులు అన్నాడు.. ఇప్పుడు మావిగన్ అంటున్నాడు. పిచ్చి మందు పేరు మావిగన్ అయ్యుండచ్చు. అందుకే జగన్ రెడ్డికి ఆ పేరు గుర్తొచ్చి చెప్తున్నాడు. రాష్ట్ర అభివృద్ధి పట్ల విషం చిమ్ముతున్న జగన్ రెడ్డికి వారి పార్టీకి రాష్ట్రంలో పుట్టగతులు ఉండవు. రాబోయే 25 సంవత్సరాలు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు బత్తుల తాతయ్య బాబు, పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర, కోట్ని బాలాజీ, పి.వి.జి.కుమార్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగ జగదీష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారంపూడి పరమేశ్, బీజేపీ నాయకులు ముత్యాల వెంకటేశ్వర రావు, జనసేన నాయకులు భీమరశెట్టి రాంకీ తదితర నాయకులు కార్యకర్తల భారీగా పాల్గొన్నారు.

## ఆపదలో ఆదుకున్న ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి చంద్రబాబు.

### పేర్కొన్న విప్ అశోక్ బాబు.



**కవిటి (పబ్లిక్ వ్యూ) ఏప్రిల్2:** ఆపదలో ఆదుకున్న ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ బాబు ముఖ్యమంత్రిని కొనియాడారు. గురువారం రామయ్యపుట్టుగ క్యాంప్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. సంక్షేమం అభివృద్ధిని రెండు కళ్ళు గా భావించి అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని అన్నారు. పింఛన్దారులకు చంద్రబాబు ఆపద్బాంధవుడని మరొకసారి కొనియాడారు.

అమరావతిని రాష్ట్ర రాజధానిగా కేంద్రం చట్టం చేయడాన్నిఆయన అభినందించారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులు మయం చేశారని ,ఇప్పుడు మన ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఆదాయం వనరులు సమకూరుస్తున్నారని పేర్కొన్నారు . అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో

ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాష్ ,పి ఎ సి ఎస్ చైర్మన్ ఎర్ర బాసు,జడ్ ఆర్ యు సి మెంబర్ శ్రీనివాసరావులో ,ఎంపిటిసి ప్రతినిధి సంతోష్ పట్నాయక్ ,బీమా రౌలో తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ప్రతిభతో ఉన్నత విద్యను అభ్యసించాలి.

### అభియాన్ ఆంధ్ర యూనివర్సిటీ రీజినల్ కోఆర్డినేటర్ పావని.






**కె.కోటపాడు,( పబ్లిక్ వ్యూ) ఏప్రిల్02:** ప్రతి విద్యార్థి ప్రతిభతో రాణించి ఉన్నత విద్యను అభ్యసించాలని ఉన్నత్ భారత్ అభియాన్ ఆంధ్ర యూనివర్సిటీ రీజినల్ కోర్డినేటర్ పావని అన్నారు. యూనిఫైడ్ కౌన్సిల్ జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ లెవెల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ 2025-26 లో గోల్డ్ మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్, క్యాష్ ప్రైజ్ సాధించిన అయ్యన్న హైస్కూల్ విజేత విద్యార్థులను ఆమె అభినందించారు.ఈ సందర్భంగా అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం ఆధ్వర్యంలో జరిగినకార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అయ్యన్న స్కూల్ ఉత్తమ విద్యా భోదనతోపాటు సేవా దృక్పధంను కొనియాడారు. ఉన్నత్ భారత్ అభియాన్ ద్వారా చేపట్టబోయే సేవా కార్యక్రమాలను రీజినల్ కోఆర్డినేటర్ పావని విద్యార్థులకు వివరించారు. డాక్టర్ ఖాశీం మాట్లాడుతూ 7వతరగతి విద్యార్థిని బొడ్డు నిహానశ్రీ నేషనల్ ర్యాంకు39, స్టేట్ ర్యాంకు 4సాధించిందని తెలిపారు. వీరందరికీ కోఆర్డినేటర్ పావని, డాక్టర్ ఖాశీం బంగారు పతకాలు,ప్రశంసా పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న విద్యా సంస్థల డైరెక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపాల్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

## తాడి గ్రామం తరలించాలని జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొల్లు రవీంద్రకు వినతి.




**పరవాడ ( పబ్లిక్ వ్యూ) ఏప్రిల్ 02:** తాడి తరలింపు పై కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తప్పక నెరవేరుస్తామని అనకాపల్లి ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. గురువారం తమ గ్రామాన్ని త్వరితగతిన తరలించడానికి చర్యలు తీసుకోవాలని తాడి గ్రామస్తులు అనకాపల్లి కలెక్టరేట్ వద్ద జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల తాడి తరలింపు పై ఇచ్చిన హామీని, గెలిచిన తర్వాత తాడి తరలింపు కోసం తీసుకున్న చర్యల గురించి మంత్రికి వివరిస్తూ, తాను ఈ విషయంపై అసెంబ్లీలో చర్చించడం జరిగిందని, అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారితో జరిగిన భేటీలో కూడా తాడి తరలింపు విషయం చెప్పడం దానికి వారు సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. తాడి తరలింపుకు అవసరమైన స్థలాన్ని సేకరించవలసిందిగా ఇప్పటికే గ్రామంలోని పెద్దలకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని

అన్నారు. అయితే గతంలో కంటే ఇప్పుడు లబ్ధిదారులు పెరగడంతో అందరికీ ఒకే చోట స్థలం కేటాయించడానికి వీలు పడకపోవడం వలన రెండు చోట్ల అయినా స్థలాన్ని కేటాయించడానికి ఆలోచిస్తున్నామన్నారు. రెండు రోజుల్లో తాసిల్దార్ ఆర్డీవోలతో కలిసి తాను స్వయంగా స్థలాన్ని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీల బాబు, మాజీ ఉపసర్పంచ్ గొల్లవిల్లి నాగరాజు, కోమటి సూరిబాబు, దానబోయిన నీలకంఠరావు తదితరులు పాల్గొన్నారు.

## నేరడి బ్యారేజికి లైన్ క్లియర్
### - కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.




**శ్రీకాకుళం-( పబ్లిక్ వ్యూ ) ఏప్రిల్ 02::** వంశధార నదిపై నేరడి బ్యారేజి నిర్మాణానికి సంబంధించి నదీ జలాల ట్రిబ్యునల్ తుది తీర్పు ఇవ్వడం, దానికి అనుగుణంగా కేంద్ర జలశక్తి శాఖ తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం ఆనందంగా ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. వ్యవసాయ ఆధారిత శ్రీకాకుళం జిల్లా భవిష్యత్తుకు ఇది ఒక చరిత్రాత్మక మలుపుగా ఆయన అభివర్ణించారు.


ఈ తీర్పుతో వంశధార నదిపై నేరడి బ్యారేజి, దానికి సంబంధించిన అనుబంధ నిర్మాణాల ఏర్పాటుకు అన్ని ఆటంకాలు తొలగిపోయాయని అన్నారు. ట్రిబ్యునల్.. గొట్టా బ్యారేజి వద్ద వంశధార నది జలల లభ్యతను 115 టీఎంసీలుగా ఖరారు చేయగా, దానిలో సగం నీరు.. రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగపడనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ సామర్థ్యం గణనీయంగా పెరగనుందని, రైతాంగం తన సాగు నీటి పరిధి విస్తరించి జిల్లాను సస్యశ్యామలం చేసుకునే దిశగా ముందడుగు పడుతుందని రామ్మోహన్ నాయుడు అన్నారు.

ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న ఈ సున్నితమైన, క్లిష్టమైన అంశంలో సమస్య పరిష్కారానికి తాను ఎన్నో ప్రయత్నాలు చేశానని రామ్మోహన్ నాయుడు అన్నారు. పార్లమెంట్ లో, జాతీయ స్థాయి వేదికలలో.. ఇలా ప్రతీ అవకాశాన్ని సమస్య పరిష్కారం కోసం వాడుకున్నామని తెలిపారు. ఆ నమ్మకంతోనే కొద్ది నెలల క్రితం జరిగిన దివంగత ఎర్రంనాయుడు గారి 69వ జయంతిలో సైతం నేరడి బ్యారేజి పూర్తికి స్పష్టమైన హామీ ని ఇచ్చిన్నట్టు రామ్మోహన్ నాయుడు గుర్తు చేశారు.

ఈ ప్రాజెక్టు ద్వారా శ్రీకాకుళం జిల్లా ఆర్థికంగా, వ్యవసాయపరంగా మరింత ఉన్నతికి చేరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరి సహకారంతో ప్రాజెక్టును సమర్థవంతంగా, పారదర్శక పద్ధతిలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సుదీర్ఘకాలంగా పోరాడుతున్న ఈ సమస్యపై విజయంలో తోడ్పాటు అందించిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రులు, ట్రిబ్యునల్ సభ్యులకు మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అమరావతి చట్టబద్ధతపై కలెక్టరేట్‌లో సంబరాలు





**అనకాపల్లి,(పబ్లిక్ వ్యూ) ఏప్రిల్ 02:** అమరావతి రాజధానిగా చట్టబద్ధత పొందిన సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయాన్ని విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించి ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ అమరావతి రాజధానిగా చట్టబద్ధత పొందడం రాష్ట్ర అభివృద్ధికి ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ప్రజల ఆశయాలను నెరవేర్చడమే కాకుండా రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని తెలిపారు. గతంలో ఎదురైన సవాళ్లను అధిగమించి ఈ స్థాయికి చేరుకోవడం అందరి కలసికట్టైన కృషి ఫలితమని అన్నారు. అమరావతి అభివృద్ధి రాష్ట్రానికి ప్రగతిపథంలో మరింత వేగాన్ని తీసుకువస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని అందరూ కలిసి ఆనందంగా స్వాగతిస్తూ హర్షాతిరేకంతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ముగ్గురికి 10 ఏళ్ల జైలు శిక్ష
### చోడవరం కోర్టు సంచలన తీర్పు
### ఒక్కొక్కరికి రూ. లక్ష జరిమానా



అనకాపల్లి,( పబ్లిక్ వ్యూ), ఏప్రిల్ 2 : స్థానిక అనకాపల్లి జిల్లా చీడికాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన భారీ గంజాయి రవాణా కేసులో చోడవరంలోని 9వ అదనపు జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నేరం రుజువైన ముగ్గురు నిందితులకు కోర్టు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధించింది. తీర్పు వెలువరించిన న్యాయమూర్తి ఎం.హరి నారాయణ, జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో 2 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని స్పష్టం చేశారు. 2016 అక్టోబర్ 13న చీడికాడ మండలం అప్పలరాజుపురం సమీపంలోని త్రిషింగ్ ఫ్లోర్స్ వద్ద పోలీసులు నిర్వహించిన దాడిలో సుమారు 300 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి అక్రమంగా గంజాయిని తెచ్చి పది ప్లాస్టిక్ బస్తాలలో నిల్వ ఉంచి తరలించేందుకు సిద్ధమవుతున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఈ దాడిని అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎస్సై జి.అప్పారావు నేతృత్వంలో పోలీసులు విజయవంతంగా నిర్వహించారు. కోర్టు శిక్ష విధించిన నిందితులు బొట్టా ఈశ్వరరావు (ఏ-1), గోకాడ తాతబాబు (ఏ-5), గోకాడ చెల్లు బాబు (ఏ-6), ఈ ముగ్గురూ చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందినవారని పోలీసులు తెలిపారు. నిందితులపై ఎన్డిపిఎస్ చట్టంలోని సెక్షన్ 20(బి)(ఋఋ)(సి) ఆర్/డబల్యు8(సి) కింద నేరం రుజువవడంతో కోర్టు ఈ శిక్ష విధించింది.

పోలీసుల పనితీరుకు ప్రశంసలు ఈ కేసులో ప్రభుత్వ తరపున వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చీపురుపల్లి సూర్యనారాయణని, కేసును పకడ్బందీగా దర్యాప్తు చేసిన ఎస్సై జి. అప్పారావును, అలాగే చీడికాడ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రత్యేకంగా అభినందించారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో పోలీసుల కృషిని ఎస్పీ అభినందిస్తూ, కోర్టు ఇచ్చిన కఠిన తీర్పు సమాజానికి హెచ్చరికగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# ప్రజలకు ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులపై అవగాహన అవసరం

జిల్లా కలెక్టర్ మరియు శాసనసభ్యులకు సూచించిన జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొల్లు రవీంద్ర.

బడ్జెట్ ను సక్రమంగా వినియోగించుకోవాలి

- జిల్లా మంత్రి వంగలపూడి అనిత.













**అనకాపల్లి(పబ్లిక్ వ్యూ) ఏప్రిల్ 2:** రాష్ట్ర బడ్జెట్ ను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యక్రమాలను రూపొందించుకోవాలని, కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శాసనసభ్యులు , ఏపీ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ సెక్రటరీ డి. రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్ ఇతర ఉన్నతాధికారులతో 2026-27 బడ్జెట్ -- ఔట్ రీచ్ అవగాహనా సదస్సును రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తో కలిసి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొల్లు రవీంద్ర నిర్వహించారు. అభివృద్ధి ప్రాజెక్టులు, సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, చేసిన బడ్జెట్ కేటాయింపులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు, అధికారులకు సూచించారు. ముందుగా బడ్జెట్ అవుట్ రీచ్ లక్ష్యాలు - జిల్లాలో బడ్జెట్ కేటాయింపులు జిల్లా కలెక్టర్ వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ వివరించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి మరియు సంక్షేమానికి మధ్య సమతుల్యత పాటిస్తూ ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొంటూ, అభివృద్ధి అంశాలకు, సంక్షేమ పథకాలకు సమన్యాయం చేస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ విశేషాలను, రంగాల వారీ కేటాయింపులను ప్రజలకు వివరించాలని, నియోజకవర్గాలలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి నియోజకవర్గాల వారీగా చేసిన కేటాయింపులపై స్థానిక శాసనసభ్యుల సమన్వయంతో ప్రత్యేక ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులకు తగ్గట్టు పనులు చేపట్టాలని, నిధులను సమృద్ధిగా వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. జిల్లాలో ఆర్సెల్లార్ మిత్తల్ సంస్థకు శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ జిల్లాలో ప్రతి స్పెషల్ ఆఫీసర్ జిల్లా అభివృద్ధిపై జవాబుదారీగా ఉండాలని, ముఖ్యంగా వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లోపం వల్ల నిధులు వృథా కాకూడదని జిల్లా మంత్రి పేర్కొన్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ, నిధులు ల్యాప్స్ అవుతున్నాయని, దీనివల్ల క్షేత్రస్థాయిలో అభివృద్ధి కుంటుపడుతోందని హెచ్చరించారు. రాష్ట్రంలోనే అనకాపల్లి జిల్లాకు ఒక ప్రత్యేకత ఉందని, ఒకవైపు సముద్ర తీరం (కోస్టల్ బెల్ట్), మరోవైపు వ్యవసాయం, ఇంకోవైపు పారిశ్రామిక రంగం. ఈ మూడింటి కలయిక ఉన్న ఏకైక జిల్లా అనకాపల్లి అని హోంమంత్రి పేర్కొన్నారు. ఈ సహజ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటే జిల్లాను రాష్ట్రంలోనే అత్యుత్తమ జిల్లాగా తీర్చిదిద్దవచ్చని ధీమా వ్యక్తం చేశారు. ఇన్నోవేటివ్ ఆలోచనలతో వ్యవసాయ, ఉద్యానవన రంగాలను లాభసాటిగా మార్చాలని, పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహిస్తూనే, కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు తమ భూములను అభివృద్ధి కోసం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, వాటిని సరైన పద్ధతిలో వినియోగించుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లా మంత్రిగా తన పూర్తి సహకారం ఉంటుందని, అధికారులు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆర్సలర్ మిట్టల్ వంటి భారీ ప్రాజెక్టుల రాకతో జిల్లా భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో ఏపీ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ సెక్రటరీ డి. రోనాల్డ్ రోస్, జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్, శాసన సభ్యులు కె ఎస్ ఎం ఎస్ రాజు, సుందరపు విజయ్ కుమార్, బండారు సత్యనారాయణమూర్తి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళా సురేంద్ర, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, ఏపి ఆర్ డి సి కార్పొరేషన్ చైర్మన్ పి.నాగేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కొట్నీ బాలాజీ, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లాస్థాయి అధికారులు, పోలీస్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాం. జిల్లాలకు కేంద్రం నుండి వచ్చిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు, కేంద్ర పథకాలు అన్నింటి గురించి సమగ్రంగా చర్చించాం. ప్రధానంగా జిల్లాకు నియోజకవర్గాల వారీగా కేటాయించిన అభివృద్ధి, సంక్షేమ బడ్జెట్ కేటాయింపులపై చర్చించామని అన్నారు. 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆస్తులు, అప్పుల కేటాయింపులో ఏపీకి కొంత మేర అన్యాయం జరిగిందని, ఆదాయం తెలంగాణకు, అప్పులు ఏపీకి కేటాయింపు జరిగిందని అయినప్పటికీ అన్ని సమస్యలు ఎదురొడ్డి ముందుకు నడుస్తున్నా మన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 99శాతం జీతాలు, వడ్డీలు, పెన్షన్లకే సరిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం తొలి రోజు నుండి పని చేస్తోంది. అందులో భాగంగానే అర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ లాంటి ప్రఖ్యాత కంపెనీలను ఏపీకి తీసుకొచ్చామని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ.13.50 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. అదే సమయంలో డీఎస్సీ ద్వారా 16,800 కానిస్టేబుల్, గ్రూప్స్ ద్వారా సుమారు 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు సహా రెండేళ్లలోనే 6.50 లక్షల ఉద్యగాలు కల్పించామని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ తలసరి ఆదాయం రూ.3.87 లక్షల కోట్లుగా ఉంటే, ఏపీ తలసరి ఆదాయం రూ.2.60 లక్షల కోట్లు మాత్రమే. ఆదాయం పెంచుకోవడంపై ప్రస్తుతం ప్రభుత్వం దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. మన రాష్ట్రం ప్రధానంగా వ్యవసాయ రంగంపైనే ఎక్కువగా ఆధారపడడం, సేవా రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారానే ఎక్కువ ఆదాయం వస్తుందిని, అందుకే జిల్లాల వారీగా లక్ష్యాలు నిర్దేశించుకుని మరీ ముందుకు వెళ్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని జిల్లాల వారీగా తలసరి ఆదాయంలో అనకాపల్లి జిల్లా 13వ స్థానంలో ఉందని తెలిపారు . అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి వెళ్తే సాధించలేనిదంటూ ఏమీ ఉండదని, వ్యవసాయ రంగం ఎక్కువగా విస్తరించి ఉన్నందున వ్యవసాయ రంగం ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోనూ అధికంగా అవకాశాలున్నాయి. మనకు అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా రాష్ట్రాన్ని అగ్రపథంలో నిలిపేందుకు అవకాశం పుష్కలంగా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మీడియా సమావేశంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ అనకాపల్లి కలెక్టరేట్లో బడ్జెట్ అవుట్ రీచ్ పై సమావేశం జరిగిందని, ఈ సమావేశానికి అనకాపల్లి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారని తెలిపారు. బడ్జెట్ పై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయి. నియోజకవర్గాల వారీగా బడ్జెట్ కేటాయింపు జరిగిందని చెప్పారు. అనకాపల్లి జిల్లా ఒక వైపు పారిశ్రామికంగా, మరోవైపు వ్యవసాయం రంగం అభివృద్ధి చెందుతుందని హోం మంత్రి తెలిపారు. అమరావతి రైతులు 1,631 రోజులు పోరాటం చేశారు. రైతులు నేలపైన భోజనాలు చేశారని కొనియాడారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకి ప్రత్యేక ధన్యవాదాలు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో గర్వంగా ఫీల్ అవుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. అమరావతి రాజధానిని ఎవరు మార్చలేరు. అమరావతి రాజధాని శంకుస్థాపనలో ఆలయాల నుండి పవిత్ర జలాలు, పవిత్ర నీరును తీసుకొచ్చారని గుర్తు చేశారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న పార్టీలు అమరావతి రాజధానికి మద్దతు చేస్తున్నారు. ఎంతో చరిత్ర కలిగిన ప్రాంతం అమరావతని తెలిపారు

# అమరావతి బిల్లుకు పార్లమెంట్ ఆమోదం ఆంధ్రులకు పండుగ దినం.






### పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు.

**పరవాడ ( పబ్లిక్ వ్యూ)ఏప్రిల్ 02**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదం తెలిపిన ఈరోజు ఆంధ్రులందరికీ పండగ రోజు అని, ఈ గొప్ప విజయాన్ని అందించిన ప్రధాని నరేంద్ర మోడీ , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ప్రజలందరూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని జనసేన విశాఖ ఉమ్మడి రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు , నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గండి బాబ్జి ,ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తల లు గురువారం రాత్రి కాగడాల ప్రదర్శన చేస్తూ హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. రాజధాని బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందడంతో పెందుర్తి కూడలిలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీలు నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. కాగడాలు వెలిగించి జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ సమర్థుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ కు శాశ్వత రాజధాని సాధించుకోగలిగామనీ, ఈరోజు ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ దీపావళి, సంక్రాంతి వంటి పండగ అని పేర్కొన్నారు. దేశంలోని పార్టీలన్నీ అమరావతికి మద్దతు తెలిపితే జగన్ మాత్రం మోకాలడ్డడానికి కుట్రలు చేశారని మండిపడ్డారు. పార్లమెంట్లో విచిత్రమైన ధోరణి ప్రదర్శిస్తూ ఆ పార్టీ దేశ ప్రజలందరిలోనూ ఛీత్కారానికి గురైందని విమర్శించారు. ప్రపంచంలోనే మూర్ఖపు ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారని ఎద్దేవా చేశారు. అమరావతి రాజధానిగా శాశ్వతంగా నిలిచి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# చరిత్రలో నిలచేలా.. అమరావతికి చట్టబద్దత బిల్లు.

-కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



**శ్రీకాకుళం(పబ్లిక్ వ్యూ). ఏప్రిల్ 02 :** ఒక పవిత్రమైన, శకతివంతమైన నేలపై ఎవరెన్ని కుట్రలు పన్నాలని చూసినా.. అమరావతి విషయంలో ఒక్క ఇటుక కూడా కదల్చలేకపోయారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. గురువారం నాడు రాజ్యసభలో అమరావతి చట్టబద్దత బిల్లును కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రవేశపెట్టగా.. చర్చకు చైర్మన్ సిపి రాధాకృష్ణన్ అనుమతిని ఇచ్చారు. కొనసాగింపు ప్రసంగాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేశారు. ఇంకోవైపు రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన తీరును రాష్ట్రానికి చెందిన ఎన్డియే ఎంపిలతో కలసి మంత్రి నారా లోకేష్ వీక్షించారు. అంతకుముందు లోక్ సభలో బిల్లుకు మద్దతు ఇచ్చినందుకు ప్రధాని మోదీ తో కూడా భేటి అయ్యి కృతజ్ఞతలు తెలిపారు. చారిత్రాత్మక బిల్లు రాజ్యసభలో అడుగిడిన వేళ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక ప్రసంగాన్ని చేశారు. తెలుగు ప్రజలందరికీ ఇది చారిత్రాత్మకమైన రోజుగా అభివర్ణించారు. చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుందని చెప్పారు.

అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారని రామ్మోహన్ నాయుడు అన్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి అలవాటని.. దానికి చట్టబద్దత కూడా నేడు తోడవ్వడం శుభపరిణామం అని అన్నారు. ఈ సందర్భంగా విభజన సమయంలో జరిగిన విషయాలను కూడా సభ దృష్టికి రామ్మోహన్ నాయుడు తీసుకువచ్చారు. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది.. మరో రాష్ట్రానికి అలా లేకుండా వదిలేయడంతో సమస్య మొదలైందని అన్నారు. దేశంలో చాలాసార్లు విభజనలు జరిగాయి కానీ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విభజన సమయంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి రూ. 16వేల కోట్ల రెవెన్యూ లోటు ఉందని రామ్మోహన్ నాయుడు అన్నారు. అలాంటి సమయంలో 5 కోట్ల మంది ఏపీ ప్రజలు సీఎం చంద్రబాబును తమ కలల రాజధానికి నిర్మాతగా ఎన్నుకున్నారని అన్నారు. తాను ఇప్పుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా విమానాశ్రయాల నిర్మాణం కోసం 1000 ఎకరాల భూమిని సేకరించడానికి అనేక ప్రయాసలు పడుతూ ఉంటామని.. కానీ వ్యక్తిపై ఉన్న నమ్మకంతో 30వేలకు పైగా ఎకరాల భూమిని స్వచ్ఛందంగా రైతులు ఇవ్వడం గొప్ప చరిత్ర అని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆ నమ్మకానికి మొదట వంత పాడి.. తరువాత మాట మార్చిన వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందని ఎద్దేవా చేశారు. . రాజధాని అమరావతి కోసం ఉద్యమించిన రైతులను తీవ్రంగా హింసించారని, . గర్భిణులు అని కూడా చూడకుండా లాఠీలతో కొట్టించిన హృదయ విదారక ఘటనలు ఎన్నో రాష్ట్రంలో అప్పట్లో చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. అలాంటి కష్టాలను సైతం ధైర్యంగా ఎదుర్కొన్న అమరావతి మహిళలకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నా అని రామ్మోహన్ నాయుడు ఉద్విగ్నంగా ప్రసంగించారు. అమరావతిని రాజధానిగా చేస్తూ పాలన అందిస్తామని 2024 ఎన్నికల్లో ఇచ్చాపురం నుండి హిందూపురం వరకు ఒకటే నినాదంతో ఎన్డియే కూటమి ప్రజల్లోకి వెళితే స్పష్టమైన హామీతో మళ్ళీ మాకు అధికారం ఇచ్చారని.. వారి ఆశలు నేడు చట్టబద్దత బిల్లుతో నెరవేరాయని రామ్మోహన్ నాయుడు అన్నారు. చరిత్రలో నిలచే ఈ బిల్లు చట్టబద్దతకు తోడ్పాటు అందించిన ప్రతీ ఒక్కరికి రామ్మోహన్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

# అమ్మా! మేము ప్రభుత్వ ఆపాఠశాలలోనే చదువుకుంటామమ్మా

**1 పాఠశాలలో అడ్మిషన్లకై స్థానిక బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల వినూత్న ప్రచారం**

**2 గ్రామాలలో తల్లిదండ్రుల ఇండ్లకు వెళ్ళి వారితో అడ్మిషన్లకై ప్రచారం**

**3 తల్లిదండ్రులనుండి విశేష స్పందన**

**4 ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు సేకరించి ప్రభుత్వపాఠశాలలో చేర్పించాలని కోరిన ఉపాధ్యాయులు**





**నక్కపల్లి (పబ్లిక్ వ్యూ) ఏప్రియల్ 2** ఇప్పటివరకూ పదవతరగతి విద్యార్థులపై ప్రధాన దృష్టి సారించిన ఉపాధ్యాయులు పరీక్షలు నేటితో ముగియడంతో పాఠశాలలో అడ్మిషన్లపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. దీనిలో భాగంగా జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావు నాయుడు ఆదేశాలమేరకు మండలంలో అన్నిపాఠశాలల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు హెచ్. ఎమ్. శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఆ పాఠశాలలో చదువుతున్న ఇతర గ్రామాల నుండి వస్తున్న పాఠశాలల 5 వ తరగతి నుండి 9 వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థుల వివరాలను సేకరించి ఉపాధ్యాయులు బృందాలుగా ఆగ్రామాలను సందర్శించి తల్లిదండ్రులతో అడ్మిషన్లకై చర్చించారు. పాఠశాలలో అమలవుతున్న అనేక సౌకర్యాలపై వారికి అవగాహన కల్పించారు తమపిల్లల ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. వారాంతపు పరీక్షలు నిర్వహణ, ఆధునిక సాంకేతక తతో కూడిన గ్రంధాలయం, రుచికరమైన ఆహారం, ఎప్పటికప్పుడు వెనుకబడిన విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించడం వంటి ఎన్నో ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలో తమ పాఠశాలనుండి విజయవాడలో ప్రభుత్వం నిర్వహించిన మాక్ అసెంబ్లీకి ఎంపికయిన విద్యార్థులు ఉండడం విశేషంగా చెప్పవచ్చునని అన్నారు ఉపాధ్యాయులు చేపడుతున్న ఈ స్పెషల్ డ్రైవ్ నకు తల్లిదండ్రులనుండి అనూహ్యస్పందన లభిస్తుందన్నారు. వీరి కృషిని పలువురు తల్లిదండ్రులు అభినందిస్తున్నారు. ఉపాధ్యాయులు చేపడుతున్న ఈ కార్యక్రమంలో కొందరు చిన్నారులు బాలికోన్నత పాఠశాలలోనే చదువుకుంటామని తల్లిదండ్రుల వద్ద తమ హర్షాన్ని తెలపడంతో ఉపాధ్యాయులు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు సత్యవతి, లోచని, గుణావతి, వరలక్ష్మి, ఝాన్సీ భ్రమరాంబాదేవి, శేషగిరిరావు, రమణ తదితరులు పాల్గొన్నారు

# పకడ్బందీ గా వేసవి కార్యచరణ ప్రణాళిక అమలు చెయ్యాలి

**సమీష్టి కృషితో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్దాం**

**జిల్లాకు మంజూరైన అభివృద్ధి, నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసేబాధ్యత అధికారులపై ఉంది**

**జిల్లా సమీక్ష కమిటీ (డి ఆర్ సి ) సమావేశంలో జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**





**అనకాపల్లి,(పబ్లిక్ వ్యూ) ఏప్రిల్ 02 ;** వేసవి దృష్ట్యా జిల్లాలో త్రాగు నీరు సమస్య లేకుండా పకడ్బందీ గా వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలు చెయ్యాలని జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్షా కమిటీ ( డి ఆర్ సి ) సమావేశం జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షతన జరిగింది. త్రాగు నీరు, ఎల్ నినో, విద్యుత్, రహదారుల, మున్సిపాల్ శాఖల పై ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, పెందుర్తి, వి మాడుగుల ఎమ్మెల్యే లు పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యన్నారాయణ మూర్తి, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ల తో కలిసి ఇంచార్జి మంత్రి సమీక్ష నిర్వహించారు.






ఈ సందర్భంగా ఇంచార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా జిల్లాలో త్రాగు నీరు సమస్య లేకుండా పక్క ప్రణాళిక తో అమలు చెయ్యాలన్నారు. జిల్లాలో కనీసం ఒక్క గ్రామం లో కూడ త్రాగు నీటి కొరత రాకుండా చర్యలు తీసుకువాలని, ఎల్ నినో ప్రభావం మన జిల్లాలో ఉంటుంది గనుక సంబందించిన శాఖ ల వారు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లా అదకారులందరు సమానవ్యం చేసుకొని స్వర్ణంధ్ర 2047 లక్ష్య సాధనకై కృషి చెయ్యాలన్నారు. ఇటీవల నక్కపల్లి లో అర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినంద నీయమన్నారు. కార్యక్రమాన్ని ఘన విజయం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు అందరికీ ధన్యవాదాలన్నారు. బడ్జెట్ ఔట్ రీచ్ కార్యక్రమంలో చర్చించిన మేరకు అవగాహన కల్పించండి. రాష్ట్రాన్ని 2047 లక్ష్యంతో పాలన సాగిస్తున్నాం. అధికారులు కూడా బాగా పని చేయాలి. ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు పని చేయాలి. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్ర తలసారి ఆదాయ. తక్కువ ఉందన్నారు. తలసారి ఆదాయం లో మన జిల్లా మరింత వెనుకబడి ఉందన్నారు. జిల్లాకు మంజూరైన అభివృద్ధి, నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలో పూర్తి చేసి, వినియోగంలోకి తీసురావాలన్నారు. జిల్లాలో రోడ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాను వ్యవసాయ రంగం తోపాటు పారిశ్రామికంగా కూడా అభివృద్ధి బాటలో నిలిపేవిధంగా నియోజకవర్గ స్థాయిలో పారిశ్రామిక పార్క్ లు ఏర్పాటుచేసి ఔత్సాహిక పారిశ్రమికవేత్తలతో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రతీ మండలంలోనూ అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించేందుకు ల్యాండ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతో శ్రమిస్తున్నారన్నారు. సమీష్టి కృషితో అభివృద్ధి పథంలో అనకాపల్లి జిల్లాను అన్నిరంగాల్లో ముందుంచేందుకు తాము శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. రైతాంగానికి మేలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంద న్నారు. పారిశ్రామికరంగ అభివృద్ధికి కూడా సమిష్టి కృషి చేస్తామన్నారు. పేదప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ముఖ్యంగా వేసవి దృష్ట్యా త్రాగునీరు, రోడ్లు, మౌలిక సదుపాయాలు వంటి సమస్యలను పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు.

సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి సత్యన్నారాయణ రావు, సీపీవో జి. రామారావు, నర్సీపట్నం,అనకాపల్లి ఆర్డీఓలు వివి రమణ, షేక్ అయిషా, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు, డి సి ఎం ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు


# రావాడ గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పంచకర్ల.





**పరవాడ (పబ్లిక్ వ్యూ) ఏప్రిల్ 2:** మండలంలోని రావాడ పంచాయతీలో స్థానిక గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు రూ” 4 కోట్ల అభివృద్ధి పనులను గురువారం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. స్థానిక ఎన్టీపీసీ నిధులతో గ్రామంలో పలుచోట్ల రోడ్లు కాలువలు నిర్మించారు. వాటిని కూడా పంచకర్ల ఈ కార్యక్రమంలో భాగంగా ప్రారంభించారు. అదేవిధంగా రావాడా గ్రామపంచాయతీలో సోమినాయుడు పాలెం లో అంగనవాడీ సెంటర్ ,జలజీవన్ మిషన్,ధృమరాయుడుపేటలో సిసి రోడ్లు, సీసీ కాలువల , గొల్లగుంట గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ లు మోటూరువానిపాలెం సీసీ రోడ్లు,డ్రెయిన్ లుధర్మారాయుడు పేట కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఐదేళ్లు ఈ రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి అనే దానికి తావు లేకుండా గత ప్రభుత్వం పరిపాలించింది అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందు చూపుతో, కేంద్ర ప్రభుత్వం సహకారంతో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. రావాడ పంచాయతీలోని దుర్గాలమ్మ అమ్మవారి పండుగ మహోత్సవ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్నా , మాజీ ఎంపీపీ సభ్యులు మాసరపు అప్పలనాయుడు , మాజీ జెడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాథ రావు, రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యులు బుగిడి రామ గోవింద రావు, ఎన్ టి పి సి పాలకవర్గ సభ్యులు, ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఏప్రిల్ లోనే గూగుల్ డేటా సెంటర్ భూమి పూజ

- **అమరావతి బిల్లుకు పార్లమెంట్ ఆమోదం**
- **హోం మంత్రి అనిత నివాసం వద్ద సంబరాలు**
- **బైక్ ర్యాలీలో పాల్గొన్న హోం మంత్రి అనిత**



**నక్కపల్లి, (పబ్లిక్ వ్యూ) ఏప్రిల్ 2** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదం తెలిపిన ఈరోజు ఆంధ్రులందరికీ పండగ రోజు అని, ఈ గొప్ప విజయాన్ని అందించిన ప్రధాని నరేంద్ర మోడీ , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ప్రజలందరూ కృతజ్ఞతలు తెలిపారు అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లును ఉభయసభలు ఆమోదించిన నేపథ్యంలో నక్కపల్లిలో హర్షాతిరేక వాతావరణం నెలకొంది. హోం మంత్రి వంగలపూడి అనిత నివాసం వద్ద పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు నిర్వహించారు. మంత్రి కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుతూ ఆనందాన్ని పంచుకున్నారు. "జై అమరావతి", "మన రాజధాని.. మన అమరావతి" అంటూ నినాదాలతో నక్కపల్లి మారుమోగింది.సారిపల్లిపాలెం మంత్రి నివాసం నుంచి నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు మంత్రి అనిత ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొని జాతీయ జెండాలు, ప్లకార్డులతో ఉత్సాహంగా నినాదాలు చేశారు. అనంతరం నక్కపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు స్వర్గీయ ఎన్.టి. రామారావు విగ్రహాలకు మంత్రి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, ఈ రోజు చరిత్రలో నిలిచిపోయే రోజు అని,గత ఐదు సంవత్సరాల్లో అమరావతి తీవ్రంగా అణచివేతకు గురైందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమరావతికి పునర్జీవం లభించిందని చెప్పారు.




పదేళ్ల నిరీక్షణ తర్వాత అమరావతి రాజధానికి చట్టబద్ధత వచ్చింది అని తెలిపారు. అమరావతి కోసం సుమారు 1600 రోజుల పాటు రైతులు పోరాటం చేశారని, వారు అనేక ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఈ రోజు ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ గర్వంగా చెప్పుకునే రోజు అని అన్నారు. ఇంకా 11 పార్టీలు అమరావతికి మద్దతు ప్రకటించాయని, అసెంబ్లీలో సీఎం బిల్లు ప్రవేశపెట్టిన సమయం కూడా ప్రత్యేకంగా గుర్తుండిపోయేలా ఉందని తెలిపారు. అమరావతి చరిత్ర ఎంతో గొప్పది. ఎవరొచ్చినా రాజధానిని కదిలించలేరు అని స్పష్టం చేశారు. అమరావతికి మద్దతు తెలిపిన కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.







# ఇమేజ్ ను డ్యామేజ్ చేస్తున్న మావిగన్...

**పబ్లిక్ వ్యూ డెస్క్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత ఐదేళ్లుగా 'రాజధాని' అనే అంశం ఒక ముగింపు లేని ప్రహసనంలా సాగుతోంది. మూడు రాజధానులంటూ గతంలో చేసిన ప్రయోగాలు విఫలమై, ప్రస్తుతం అమరావతికి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పిస్తున్న తరుణంలో, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తాజాగా తెరపైకి తెచ్చిన 'మావిగన్' అనే వింత పేరు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాస్యాస్పదంగా మారింది. సీరియస్ రాజకీయాలు చేయాల్సిన సమయంలో జగన్ ఇలాంటి వింత పేర్లతో ముందుకు రావడంపై నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడుతున్నారు.అక్షరాలను కలిపి ఏదో ఇంటర్నేషనల్ బ్రాండ్ పేరులా వినిపిస్తున్న ఈ 'మావిగన్' అనే పదం వినగానే జనం నోరెళ్లబెడుతున్నారు. అసలు ఈ పేరు ఎక్కడ నుండి పుట్టింది? దీని వెనుక ఉన్న లాజిక్ ఏంటి? అని ఆరా తీస్తున్నారు. రాజధాని విషయంలో ఇప్పటికే ప్రజల్లో ఉన్న గందరగోళాన్ని తొలగించాల్సింది పోయి, ఇలాంటి అల్లాటప్పా పేర్లతో కాలయాపన చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "గతంలో మూడు రాజధానులు అన్నారు, ఇప్పుడు ఈ కొత్త 'గన్' ఎక్కడి నుండి వచ్చింది?" అంటూ సామాన్యులు జోకులు వేసుకుంటున్నారు.ఈ 'మావిగన్' పేరుపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించిన తీరు ఇప్పుడు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతోంది. మీడియా ప్రతినిధులు ఈ పేరును ప్రస్తావించగానే, పవన్ కళ్యాణ్ ఆపుకోలేక నవ్విన తీరు జగన్ రాజకీయ పరిజ్ఞానంపై ఆయనకున్న అభిప్రాయాన్ని స్పష్టం చేసింది. "ఇన్ని వింత పేర్లు వీరికి ఎక్కడ దొరుకుతాయో ఏమో!" అన్నట్లుగా పవన్ ఇచ్చిన ఆ వెటకారపు నవ్వు, జగన్ ప్రతిపాదన ఎంత సిల్లీగా ఉందో చెప్పకనే చెప్పిఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా ఉండాల్సిన వ్యక్తి, ఇలాంటి హాస్యాస్పదమైన మాటలతో నవ్వులపాలవ్వడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పవన్ నవ్వు జగన్ వైఖరికి ఒక బలమైన మౌన కౌంటర్ లా మారిందని చర్చించుకుంటున్నారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన ఎక్స్, వాట్సాప్ గ్రూపుల్లో 'మావిగన్' పై రచ్చ మామూలుగా లేదు. "మావిగన్ అంటే ఏదో కొత్త రకమైన విదేశీ తుపాకీ పేరులా ఉంది" అని కొందరు సెటైర్లు వేస్తుంటే, మరికొందరు "సీజన్ మారినప్పుడల్లా రాజధాని పేరు మార్చడం జగన్ కే చెల్లింది" అని విమర్శిస్తున్నారు. జగన్ పాత వీడియోలను, ఇప్పటి మావిగన్ మాటలను కలిపి నెటిజన్లు క్రియేటివ్ పేరడీ వీడియోలు సృష్టిస్తున్నారు. ఒక సీరియస్ రాజకీయ అంశాన్ని జగన్ కామెడీ షోగా మార్చేశారని, అందుకే ఆయనను విమర్శించాలన్నా జాలి వేస్తోందని నెటిజన్లు 'పాపం జగన్' అంటూ హ్యాష్ ట్యాగ్‌లు ట్రెండ్ చేస్తున్నారు.అమరావతిని అడ్డుకోవడానికి జగన్ ఎన్ని దారులు వెతికినా చివరకు ఇలాంటి సిల్లీ ప్రతిపాదనల దగ్గరే ఆగిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంట్ చట్టం చేస్తున్నా సరే, ఇంకా ఏదో ఒక వింత పేరుతో కాలయాపన చేయడం వల్ల పార్టీకే నష్టమని వైసీపీ నేతలు కూడా లోలోపల మదనపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.మొత్తానికి, 'మావిగన్' పేరుతో జగన్ రెడ్డి తన రాజకీయాల్లో మరో 'సెల్ఫ్ గోల్' వేసుకున్నారని స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన రాజధాని అంశాన్ని ఒక కుళ్లు జోక్ స్థాయికి తగ్గించేలా జగన్ వ్యవహరించడం శోచనీయమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవేళ ఇది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం అయితే, అది బెడిసికొట్టి జగన్ ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేసిందనడంలో అతిశయోక్తి లేదు.

# పోలవరానికి నిధులు...

**పబ్లిక్ వ్యూ డెస్క్:**
ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఏపీ జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు రూ.1301 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులు పోలవరం ప్రాజెక్టు అకౌంట్లోకి నేరుగా జమ అవుతాయని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఏపీ విషయంలో కేంద్రం ఉదారంగా వ్యవహరిస్తోంది. మూడోసారి ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత వార్షిక బడ్జెట్లో అమరావతి రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించింది. గతంలో రూ.1508 కోట్లు విడుదల చేయగా.. తాజాగా మరోసారి కేంద్రం అడ్వాన్సుడ్ నిధులు కేటాయించింది. మొత్తానికి ఈ 22 నెలల్లో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రూ.2809కోట్లు అందినట్లు అయింది. మరోవైపు ఈనెల 2న పోలవరం పర్యటనకు వెళ్తున్నారు గవర్నర్ అబ్దుల్ నజీర్. ఎప్పటికప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు పనులను సమీక్షిస్తూ వచ్చారు. పోలవరం పై కేంద్రానికి నివేదికలు ఇస్తూనే ఉన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ నిధులను కేటాయించింది. అయితే గత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల మేరకు నిధులు దాదాపుగా వచ్చేశాయి.కేంద్ర ప్రభుత్వం గతంలో రూ.1508 కోట్లు మంజూరు చేయగా అందులో రూ.600 కోట్లు ప్రాజెక్టు పనుల కోసం కేటాయించింది. మరో రూ.300 కోట్లు పునరావసం, భూ సేకరణ కోసం ఖర్చు చేశారు. ఇటీవల కేంద్ర జలశక్తి అధికారులు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చారు. ఆ సమయంలో ఏపీ అధికారులు నీతుల విషయాన్ని ప్రస్తావించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు కోసం సింగిల్ నోడల్ అకౌంట్ కు నిధులను విడుదల చేయడం ఇదే చివరిసారి. ఇకపై స్పర్శ విధానంలో నిధులను విడుదల చేయనున్నారుసకాలంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేసి జాతికి అందించాలన్న లక్ష్యంతో ఉంది ఏపీ ప్రభుత్వం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో శరవేగంగా పనులు జరిపిస్తోంది. గత అనుభవాల దృష్ట్యా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని చూస్తోంది. అయితే మొన్నటి బడ్జెట్ సెషన్స్ లో సైతం ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పోలవరం ప్రాజెక్టు ప్రత్యేక ప్రస్తావన తీసుకొచ్చారు. ఆ ప్రాజెక్టుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే ఇప్పుడు భారీగా నిధులు కేటాయించారు. ఇది శుభ పరిణామం కూడా..



# యానిమేటర్లకు 5 జీ న్యూస్

**పబ్లిక్ వ్యూ డెస్క్:** ఏపీ ప్రభుత్వం రెండు నెలల క్రితం యానిమేటర్లకు ఇచ్చిన హామీ ఇచ్చిన హామీని త్వరలోనే నెరవేర్చనుంది. యానిమేటర్లందరికీ 5జీ మొబైల్స్ ఇవ్వబోతోంది. ఇప్పటికే అధికారులు జిల్లాలకు మొబైల్స్‌ను పంపించారు. త్వరలోనే యానిమేటర్లకు మొబైల్స్‌ను పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. యానిమేటర్లకు ఇస్తున్న ఒక్కో ఫోన్ విలువ రూ.15 వేలు.. ఈ కొత్త మొబైల్స్ ద్వారా సేవల్ని మరింత వేగవంతం చేస్తామని యానిమేటర్లు చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యానిమేటర్లకు (వీవోఏ) తీపికబురు చెప్పింది. రెండు నెలల క్రితం చెప్పిన విధంగా యానిమేటర్లకు 5జీ మొబైల్స్‌ను అందించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు జిల్లాలకు మొబైల్స్‌ను ఇప్పటికే పంపించారు.. అవి డీఆర్డీఏ కార్యాలయాలకు చేరాయి. త్వరలోనే మొబైల్స్‌ను యానిమేటర్లకు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. యానిమేటర్లకు ఇస్తున్న ఒక్కో ఫోన్ ధర రూ. 15 వేల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఈ మొబైల్స్ ద్వారా యానిమేటర్లు ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించనున్నారు.డీఆర్‌డీఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో యానిమేటర్లు పొదుపు సంఘాలకు అండగా ఉంటున్నారు. సంఘాల పని తీరు పర్యవేక్షించడం, బుక్ కీపింగ్, బ్యాంకు లింకేజీ, రుణాలు ఇప్పించడం, ప్రభుత్వ రాయితీలు, వడ్డీ లేని రుణాలు, కొత్త సంఘాలను ఏర్పాటు చేయడం, డబ్బులు-మన లెక్కలు అనే యాప్‌కు సంబంధించిన సేవలను యానిమేటర్లు అందిస్తున్నారు. వీరు విధినిర్వహణలో భాగంగా కొన్ని యాప్స్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే వీరికి గతంలో ఇచ్చిన మొబైల్స్, ట్యాబ్స్ పనిచేయకపోవడంతో.. సొంత మొబైల్స్ వాడుతున్నారు. కొంత మంది ఫోన్లు మొరాయించడంతో ఇబ్బంది పడుతున్నారు.దీంతో తమకు మొబైల్స్ ఇవ్వాలని యానిమేటర్లు ప్రభుత్వాన్ని కోరారు. వారిని వినతి పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మొబైల్స్ అందించాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27 వేల 500 మంది యానిమేటర్లు.. 5 వేల మంది కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు మొబైల్స్ అందించనున్నారు. ఈ మొబైల్స్ అందిస్తే సేవల్ని మరింత వేగవంతం చేస్తామని యానిమేటర్లు చెబుతున్నారుఏపీ ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు కూడా మొబైల్స్ అందించిన సంగతి తెలిసిందే. వారికి ఒక్కొక్కరికి రూ.12,500 విలువైన ఫోన్లను అందించడం కోసం ప్రభుత్వం రూ.74 కోట్లు ఖర్చు చేసింది. అంగన్‌వాడీలలో లబ్ధిదారుల వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం వారందరికి మొబైల్స్ అందించింది. మొత్తం మీద అంగన్‌వాడీలకు మొబైల్ కష్టాలు తీరిపోగా.. ఇటు త్వరలోనే యానిమేటర్లకు కూడా కొత్త 5జీ మొబైల్స్ అందజేయనున్నారు.

# తెగేదాక లాగుతున్న దువ్వాడ

**పబ్లిక్ వ్యూ డెస్క్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మరో అసమ్మతి గళం సోషల్ మీడియా వేదికగా బయటకు వచ్చింది. వ్యక్తిగత వివాదాలతో పార్టీకి దూరం అయిన దువ్వాడ శ్రీనివాస్ ఇటీవలనే జగన్మోహన్ రెడ్డిని కలిశారు. త్వరలో వచ్చి కలుస్తానని చెప్పారు. మీరు ఎలా చెబితే అలా నడుచుకుంటానని కూడా అన్నారు. దీంతో దువ్వాడ శ్రీనివాస్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి రీఎంట్రీ ఇస్తారని ఆయన అభిమానులు తెగ హడావిడి చేశారు. కానీ ఇటీవల జరిగిన పరిణామాలతో దువ్వాడ శ్రీనివాస్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. వైసీపీలో ఆయన రీఎంట్రీ పై అనేక రకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన వైసీపీలో చేరడం దాదాపు అసాధ్యం అని కూడా తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ఆయన వైసీపీలోకి తెచ్చుకునే ఛాన్స్ కనిపించడం లేదు శ్రీకాకుళం జిల్లాలో..ఇటీవల ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మూలపేట పోర్టు సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా శ్రేణులంతా హాజరయ్యాయి. అయితే దీనిపై దువ్వాడ ఇది ఎంత అధర్మం అంటూ పోస్ట్ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన కార్యక్రమాన్ని పొలిటికల్ డ్రామాగా అభివర్ణించారు. పోర్టు లోపలికి 40 మందికి అనుమతి ఉంటే ధర్మాన ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. అధర్మంగా పూర్తికి పది మీటర్ల దూరంలో టెంట్లు వేసుకుని మాట్లాడి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. కోర్టుకు వంద మీటర్ల రోడ్డు కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాల కోసం అసలు ప్రస్తావించలేదని.. నిర్వాసితులకు తీవ్ర నిరాశ మిగిల్చారు అంటూ వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసిపి కార్యక్రమాన్ని దువ్వాడ శ్రీనివాస్ వ్యతిరేకించడం చూస్తుంటే మాత్రం ఆయన రీ యంట్రి విషయం తేలిపోయినట్లు అయింది.అధినేత జగన్మోహన్ రెడ్డి పట్ల వీర విధేయత ప్రదర్శిస్తూ వస్తున్నారు దువ్వాడ శ్రీనివాస్. కానీ జిల్లాలో ధర్మాన సోదరులను వ్యతిరేకిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు ఏకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని డ్రామా తో అభివర్ణించడంతో దువ్వాడ శ్రీనివాస్ కు దారులు మూసుకుపోయినట్టే. దువ్వాడ విషయంలో జిల్లాలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలంతా ఒకే మాటతో ఉన్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత వివాదాలతో పార్టీని ఇబ్బందుల్లో పెట్టిన దువ్వాడను మరోసారి పార్టీలోకి తీసుకోవద్దని జగన్మోహన్ రెడ్డికి తేల్చి చెప్పినట్లు సమాచారం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పోర్టు సందర్శన సక్సెస్ అయ్యిందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కానీ దువ్వాడ శ్రీనివాస్ మాత్రం అదే కార్యక్రమం పై విమర్శలు చేయడంపై వైసీపీ నాయకత్వం కూడా సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు డోర్స్ క్లోజ్ అయినట్టే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి దువ్వాడ శ్రీనివాస్ కు. చూడాలి మరి ఏం జరుగుతుందో..


# అయోమయంలో వైసీపీ.. చిక్కుల్లో జగన్!

**పబ్లిక్ వ్యూ డెస్క్:**



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత సున్నితమైన, కీలకమైన అమరావతి విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యూహాత్మక తప్పిదం చేసిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. 2019-24 మధ్య మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి, ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకున్న తర్వాత కూడా ఆ పార్టీ తన పంథాను మార్చుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. తాజాగా లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే ఏపీ పునర్విభజన సవరణ బిల్లు-2026 ఆమోదం పొందిన వేళ.. జగన్ మోహన్ రెడ్డి తెరపైకి తెచ్చిన మావిగన్ అనే కొత్త ప్రతిపాదన ఆ పార్టీని మరింత రాజకీయ రక్షణలో పడేసింది.మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులను కలిపి మావిగన్ అనే గ్రోత్ కారిడార్‌ను రాజధానిగా జగన్ ప్రతిపాదించడం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. అయితే, పార్లమెంట్ సాక్షిగా అమరావతికి శాసనపరమైన గుర్తింపు దక్కిన ఈ తరుణంలో ఇలాంటి ప్రతిపాదనలు చేయడం చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం లాంటిదేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమరావతి ఇప్పుడు కేవలం ఒక రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మాత్రమే కాదు, అది పార్లమెంట్ ఆమోదించిన చట్టం. జగన్ భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా తన వ్యక్తిగత కార్యాలయాలను ఎక్కడైనా పెట్టుకోవచ్చు కానీ, రాజధానిని తరలించడం అనేది ఇప్పుడు అసాధ్యమైన ప్రక్రియగా మారింది.రాజధాని విషయంలో వైసీపీ అనుసరిస్తున్న దోబూచులాట ఆ పార్టీ క్యాడర్‌ను కూడా గందరగోళానికి గురిచేస్తోంది. ఒకవైపు అమరావతికి తాము వ్యతిరేకం కాదని చెబుతూనే, మరోవైపు పార్లమెంట్‌లో బిల్లును వ్యతిరేకించి వాకౌట్ చేయడం ద్వారా తమ ద్వంద్వ వైఖరిని బయటపెట్టుకున్నారు. ఈ సమయంలో అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, కేవలం అక్కడ జరుగుతున్నట్లుగా తాము భావిస్తున్న అవినీతి పై మాత్రమే పోరాటం చేసి ఉంటే వైసీపీకి రాజకీయంగా మైలేజీ దక్కేది. కానీ, ఇప్పుడు మావిగన్ వంటి కొత్త పేర్లతో గందరగోళం సృష్టించడం వల్ల ప్రజల్లో ఆ పార్టీ విశ్వసనీయత మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది.అమరావతిని స్మశానం అని, గ్రాఫిక్స్ అని ఎద్దేవా చేసిన నేతలే, ఇప్పుడు రాజధాని హోదా కల్పించడాన్ని తప్పుపడుతున్నారు. సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు వంటి వారు అన్నీ అమరావతికే చేస్తే మేము అడుక్కుతినాలా? అని చేస్తున్న వ్యాఖ్యలు ప్రాంతీయ విద్వేషాలను రేకెత్తించేలా ఉన్నాయి. ఇలాంటి వ్యాఖ్యలను కట్టడి చేయకుండా, జగన్ కూడా అదే బాటలో ప్రయాణించడం ఆయన రాజకీయ భవిష్యత్తుకే ముప్పు తెచ్చేలా ఉంది. అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ముద్ర ఇప్పటికే పడటంతో, మావిగన్ ప్రతిపాదన ఆ ముద్రను మరింత బలపరుస్తోంది. రాజకీయాల్లో టైమింగ్ చాలా ముఖ్యం. కేంద్రం అమరావతికి నిధులు ఇవ్వడమే కాకుండా చట్టబద్ధత కూడా కల్పిస్తున్నప్పుడు, దానికి క్రెడిట్ రాకుండా చూడటం లేదా ఆ క్రెడిట్‌లో భాగస్వామ్యం కావడం విజ్ఞత అనిపించుకుంటుంది. కానీ వైసీపీ వ్యూహకర్తలు జగన్ చేత చట్టాన్ని సవరించలేరా అనే వ్యాఖ్యలు చేయించడం ద్వారా తాము అభివృద్ధి నిరోధకులమనే సంకేతాలు పంపారు. పోతరాజు తనను తాను కొట్టుకున్నట్లుగా, కేవలం పంతం కోసమే రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిలబడుతున్నామనే అభిప్రాయం ప్రజల్లో కలిగేలా ఈ మావిగన్ రాజకీయం సాగుతోందన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

# నిర్మాతగా దూసుకుపోతున్న సుకుమార్!



నేహా శర్మ లుక్ మిస్ అవ్వడం చాలా బాగుంది





శ్రేయా ధన్వంతరి కాన్ఫిడెంట్ న్యూ లుక్‌లో టోన్డ్ అబ్స్‌ని ప్రదర్శించింది

దర్శకుడిగా సుకుమార్ ఎలాంటి విజయాలు అందించారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. -ఆర్య- నుంచి -పుష్ప 2- వరకూ ఎన్నో వైవిధ్యమైన చిత్రాల్ని అందించారు. ప్రత్యేకించి -పుష్ప- విజయంతో స్టార్ డైరెక్టర్ గా ఇండియాలోనే ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నారు. ప్రస్తుతం ఇండియాన్ టాప్ 5 డైరెక్టర్లలో ఆయన ఒకరు. ఇప్పుడా యనతో సినిమాలు చేయడానికి బాలీవుడ్ సహా స్టార్ హీరోలంతా క్యూలో ఉన్నారు. అలాగే తెలివైన శిష్యులను అందించడంలోనూ ఆయనే ముందున్నారు. ఇప్పటికే ఆయన స్కూల్ నుంచి కొంత మంది శిష్యులు డైరెక్టర్లగా రాణిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే నిర్మాతగానూ సుకుమార్ మరింత బిజీ అవుతున్నారు. ఈ విషయంలో ఏ స్టార్ డైరెక్టర్ లేనంత బిజీగా సుకుమార్ కనిపిస్తున్నారు. వరుసగా తన సొంత బ్యానర్ సుకుమార్ క్రియేటివ్ వర్క్స్ లో సినిమాలు నిర్మిస్తూ హైలైట్ అవుతున్నారు. -కుమారి 21 ఎఫ్- తో నిర్మాతగా తెరంగేట్రం చేసిన లెక్కలు మాస్టారు అనంతరం అదే సినిమా రీమేక్ కు సమర్పకుడిగా వ్యవహరించారు. -100 పర్సంట్ కాదల్- ను సమర్పించారు. అటుపై బుచ్చి బాబు దర్శకత్వం వహించిన -ఉప్పెన- కు నిర్మాతగా పని చేసారు. -విరూపాక్ష- చిత్ర నిర్మాణంలోనూ భాగమయ్యారు.-మంజుమ్మల్ బోయ్స్- లాంటి మలయాళ చిత్రాన్ని తెలుగు అనువాదంలో ఆయన హస్తం ఉంది. ప్రస్తుతం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తోన్న -పెద్ది- సినిమాకు నిర్మాతగా కొనసాగుతున్నారు. మరో రెండు బ్యానర్లతో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అలాగే నాగ చైతన్య హీరోగా కార్తీక్ దండు తెరకెక్కిస్తోన్న -వృషకర్మ- సినిమా నిర్మాణంలో భాగమయ్యారు. అసలు విషయం ఏంటంటే ఈ సినిమాలన్నింటినీ తన శిష్యులు డైరెక్ట్ చేయడం ఇంట్రెస్టింగ్. ఆ కథల్లో సుకుమార్ హస్తం కూడా ఉంది. రచన విభాగంలో ఆయన ఇన్వాల్వ్ అవుతూ అవసరమైన ఇన్ పుట్స్ ఇస్తున్నారు.ఆ రకంగా తన బ్రాండ్ ను, పేరునే పెట్టుబడి పెడుతున్నారు. తాజాగా ప్రియదర్శి హీరోగా కూడా ఓ సినిమా నిర్మిస్తున్నారు. తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిది. బన్నీ వాసుతో కలిసి సుకుమార్ ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. ఇవిగాక మరో రెండు..మూడు చిత్రాలకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. ఓ స్టార్ డైరెక్టర్ నిర్మాతగా ఇంత బిజీగా ఉండటం అన్నది సుకుమార్ కే చెల్లింది. -పుష్ప 2- రిలీజ్ అయిన దగ్గర నుంచి సుకుమార్ నిర్మాణంలోనే బిజీగా ఉంటున్నారు. త్వరలోనే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కొత్త చిత్రం ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నారు. -పెద్ది- రిలీజ్ అనంతరం చిత్రాన్ని పట్టాలెక్కించనున్నారు.

## అప్పుడేమో కేఎల్ రాహుల్, ఇప్పుడు రిషబ్ పంత్‌ను ఘోరంగా అవమానించిన లక్నో ఓనర్




పబ్లిక్ వ్యూ డెస్క్: లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, తన జట్టు ఆటగాళ్లతో వ్యవహరించే తీరు మొదటి నుంచి వివాదస్పదంగా మారింది. రైజింగ్ పూణే సూపర్ జెయింట్స్ ఉన్నప్పుడు ధోనీని కెప్టెన్సీ నుంచి తప్పించి, స్టీవ్ స్మిత్‌కి సారథ్య బాధ్యతలు అప్పగించిన సంజీవ్ గోయెంకా. ఆ తర్వాత 2024 సీజన్‌లో స్టేడియంలోనే కేఎల్ రాహుల్‌ని తిట్టడంతో వివాదాల్లో నిలిచాడు. అయినా అతని పద్ధతిని ఏ మాత్రం మార్చుకోలేదు. ఏప్రిల్ 1న ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో లక్నో ఓడిపోయిన తర్వాత కెప్టెన్ రిషబ్ పంత్‌పై అతడు సీరియస్ అయ్యాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 18.4 ఓవర్లలో 141 పరుగులకి ఆలౌట్ అయ్యింది. సమీర్ రిజ్వీ హాఫ్ సెంచరీతో ఈ లక్ష్యాన్ని 17.1 ఓవర్లలోనే ఢిల్లీ ఛేదించింది. ఆరంభంలో లక్నో బౌలర్లు వెంటవెంటనే 4 వికెట్లు తీసినప్పటికీ.. సమీర్ రిజ్వీ ( 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులతో 70 పరుగులు) , ట్రిస్టన్ స్టబ్స్ ( 32 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్సులతో 39 పరుగులు) కలిసి 119 పరుగుల భాగస్వామ్యంతో మ్యాచ్‌ని సక్సెస్ ఫుల్ గా ముగించేశారు.

**రిషబ్ పంత్‌తో సీరియస్ చర్చలు:**

ఈ ఓటమి తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, కెప్టెన్ రిషబ్ పంత్‌తో గ్రౌండ్‌లో సీరియస్‌గా చర్చించడం కెమెరాల్లో కనిపించింది. వాళ్లేం మాట్లాడుకున్నారో వినిపించకపోయినా సంజీవ్ , రిషబ్ పంత్‌కి ఏదో చూపిస్తూ సీరియస్‌గా చెప్పడం, దానికి అతను ముఖం చిన్నబుచ్చుకోవడం నెట్టింట వైరల్ గా మారిన వీడియోల్లో కనిపిస్తుంది. జట్టు పర్ఫామెన్స్ కారణంగా సంజీవ్ గోయెంకాకి కోపం రావడంలో తప్పు లేదు, కానీ ఇలా గ్రౌండ్‌లోకి వచ్చి మరీ ఇంటర్నేషనల్ క్రికెటర్‌ని ఘోరంగా అవమానించడం మాత్రం కరెక్ట్ కాదని నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. రూ.27 కోట్లు పెట్టి కొనుగోలు చేశామని.. ఎన్ని తిట్టినా భరించాలని అనుకునే కార్పరేట్ పద్ధతి, జెంటిల్మెన్ గేమ్ క్రికెట్‌కి సెట్ కాదనే విషయాన్ని సంజీవ్ గోయెంకా గుర్తు పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

**గతంలో కేఎల్ రాహుల్‌ని తిట్టిన సంజీవ్:**

2024 ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 10 వికెట్ల తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో, 165 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ కొట్టిన కొట్టుడికి ఈ లక్ష్యాన్ని 9.4 ఓవర్లలోనే ఊదేసింది సన్‌రైజర్స్. ఈ మ్యాచ్ అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, స్టేడియంలోనే అప్పటి లక్నో టీమ్ కెప్టెన్ కేఎల్ రాహుల్‌ని తిట్టడం సంచలనంగా మారింది.

**సంజీవ్ గోయెంకా తీరుపై విమర్శలు:**

ఈ ఘటన తర్వాత క్రికెట్ అభిమానులు, మాజీ క్రికెటర్లు అందరూ కూడా సంజీవ్ గోయెంకా తీరుని తీవ్రంగా తప్పుబట్టారు. డబ్బులు పెట్టినంత మాత్రాన, అంతర్జాతీయ క్రికెట్ ఆడే ప్లేయర్‌ని ఇలా మైదానంలో ప్రేక్షకులందరి ముందు చివాట్లు పెట్టి, అవమానించడం మంచి పద్ధతి కాదని విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో బ్యాడ్ అయిపోవడంతో కేఎల్ రాహుల్‌ని ఇంటికి పిలిచి, డిన్నర్ ఏర్పాటు చేసి సంజీవ్ గోయెంకా 'సారీ' చెప్పగా.. అందరి ముందు తిట్టి, ప్రైవేటుగా సారీ చెబితే చెల్లిపోతుందా? అందుకే ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్‌ని వీడి, ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరాడు.

ఇక ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్సీ ఆఫర్ చేసినా గత అనుభవం కారణంగానే సారథ్య బాధ్యతలు తీసుకోవడానికి కేఎల్ రాహుల్ ఇష్టపడలేదు. 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో 57 పరుగులు చేసి, ఢిల్లీ క్యాపిటల్స్‌ని విజయం అందించాడు. మ్యాచ్ తర్వాత సంజీవ్ గోయెంకా మాట్లాడడానికి ప్రయత్నించినా.. రాహుల్ పట్టించుకోకపోవడం కెమెరాల్లో కనిపించింది. కానీ ఈసారి సంజీవ్ గోయెంకా తీరు మార్చుకోకపోతే రిషబ్ పంత్ కూడా లక్నో సూపర్ జెయింట్స్ నుంచి జంప్ కావడం ఖాయమంటూ ఐపీఎల్ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు దక్షిణాఫ్రికా స్టార్ క్రికెటర్ వీడ్కోలు.. వన్డేల్లో ఏబీడీ తర్వాత అతడే!

పబ్లిక్ వ్యూ డెస్క్:దక్షిణాఫ్రికా క్రికెట్‌లో నమ్మకమైన వైట్-బాల్ బ్యాటర్‌గా పేరుగాంచిన రాసీ వాన్ డర్ డస్సెన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన ద్వారా వెల్లడించాడు. దేశం తరఫున ఆడటం తన జీవితంలో దక్కిన గొప్ప గౌరవమని, ఈ ప్రయాణంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన భావోద్వేగానికి గురయ్యాడు."గర్వంతో, కృతజ్ఞతాభావంతో నేను నా అంతర్జాతీయ క్రికెట్ రిటైర్మెంట్‌ను ప్రకటిస్తున్నాను. ప్రొటీస్ జెర్సీ ధరించడం ఒక ప్రత్యేకమైన అనుభూతి. నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో దక్కిన అతిపెద్ద గౌరవం. ఈ ప్రయాణం కోసం ఎన్నో త్యాగాలు చేశాను. కానీ దక్షిణాఫ్రికా తరఫున ఆడిన ప్రతీ క్షణం ఎంతో విలువైనది" అని తన ప్రకటనలో పేర్కొన్నాడు.

దేశవాళీ క్రికెట్, వివిధ టీ20 లీగ్‌లలో రాణించిన తర్వాత 29 ఏళ్ల వయసులో లేటుగా వాన్ డర్ డస్సెన్ దక్షిణాఫ్రికా జట్టులోకి అరంగేట్రం చేశాడు. 2019లో ఇంగ్లండ్‌పై టెస్టుల్లో అడుగుపెట్టినా, అతడు వన్డే ఫార్మాట్‌లో అత్యద్భుతంగా రాణించాడు. దక్షిణాఫ్రికా మిడిల్ ఆర్డర్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. మొత్తం 71 వన్డే మ్యాచ్‌లలో 50కి పైగా సగటుతో 2,657 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికా తరఫున అత్యధిక సగటు కలిగిన ఆటగాళ్ల జాబితాలో ఏబీ డివిలియర్స్ తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. తన కెరీర్‌లో 18 టెస్టులు, 57 టీ20లు కూడా ఆడాడు. ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన వారిని రాసీ గుర్తుచేసుకున్నారు. "క్రికెట్ దక్షిణాఫ్రికా, కోచ్‌లు, మేనేజర్‌లకు నా ధన్యవాదాలు. నా భార్య లారా ప్రతీ అడుగులో నాకు తోడుగా నిలిచింది.




అభిమానులు నన్ను 'మా థౌజండ్' అని పిలవడం, వాండరర్స్ స్టేడియంలో బ్యాటింగ్‌కు వెళ్తున్నప్పుడు ప్రేక్షకుల కేరింతలు ఎప్పటికీ మర్చిపోలేను" అని తెలిపాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, తన ప్రయాణం ముగియలేదని వాన్ డర్ డస్సెన్ స్పష్టం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో తన జట్టు 'లయన్స్' తరఫున ఆడటాన్ని కొనసాగిస్తానని, భవిష్యత్ తరాల దక్షిణాఫ్రికా క్రికెటర్లకు మార్గనిర్దేశం చేస్తానని పేర్కొన్నాడు. యువ ఆటగాళ్లు పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డాలని రాసీ సూచించాడు.

## 15 ఏళ్లయినా ఆ రాత్రిని మర్చిపోలేం.. 2011 ప్రపంచకప్ ఫైనల్‌పై సచిన్ ఎమోషనల్ పోస్ట్

పబ్లిక్ వ్యూ డెస్క్: భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన 2011 ప్రపంచకప్ విజయాన్ని సాధించి నేటికి 15 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నాడు. ఆ ఫైనల్ మ్యాచ్‌లోని ఉత్కంఠను, విజయం తర్వాత కలిగిన ఆనందాన్ని పంచుకుంటూ సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టాడు."మొదటి బంతి ఎప్పుడూ గుండె వేగాన్ని పెంచుతుంది. కానీ ఆ రాత్రి, ఆ వేగం అస్సలు తగ్గలేదు. 15 ఏళ్ల తర్వాత కూడా ఆ జ్ఞాపకాలు మాతోనే ఉన్నాయి. భారత్ కోసం ప్రపంచకప్ గెలవాలనే ఒకే ఒక్క కలతో మేమంతా పెరిగాం. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతీ ఒక్కరికీ, అభిమానులందరికీ ధన్యవాదాలు" అంటూ సచిన్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్‌ను సొంత గడ్డపై గెలవడం సచిన్‌కు మరపురాని అనుభూతిని మిగిల్చింది.2011 ఏప్రిల్ 2న ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, శ్రీలంక జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక, మహేల జయవర్ధనే అద్భుతమైన సెంచరీతో (103 నాటౌట్) రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 274 పరుగుల భారీ స్కోరు సాధించింది.275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గౌతమ్ గంభీర్, బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 3 పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్నప్పటికీ, 97 పరుగులతో విజయానికి బలమైన పునాది వేశాడు.అనంతరం కెప్టెన్ ఎంఎస్ ధోనీ క్రీజులో నిలబడి మ్యాచ్‌ను తన చేతుల్లోకి తీసుకున్నాడు. యువరాజ్ సింగ్‌తో (21 నాటౌట్) కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ధోనీ, కేవలం 79 బంతుల్లో 91 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. చివరిలో సిక్సర్ బాది భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో 28 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 1983 తర్వాత భారత్ రెండోసారి వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడి, దేశవ్యాప్తంగా సంబరాల్లో మునిగిపోయింది.




On behalf of Published and owned by CHIRIKI LOKESWARA RAO , Published at D.NO: 12-132, B.C. COLONY, VILLAGE PARAWADA, POST & MANDAL, ANAKAPALLI DIST, ANDHRA, ANDHRAPRADESH -531021. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, FLAT.NO: 504, BHARAT TOWERS, 5TH LANE, DWARAKA NAGAR, DISTRICT VISAKHAPATNAM, ANDHRAPRADESH-530018. Editor: CHIRIKI LOKESWARA RAO, (Responsible for selection of news under the PRB Act ) PRGI No: APTEL/2023/88653